**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 54, పేజీలు - 08

గురువారం, ఆగష్టు 20, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD





# హైదరాబాద్‌లో ట్రాఫిక్ నరకం

## - వన్-వే లు, గుంతల రోడ్లు!

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) విశ్వనగరంగా గ్లోబల్ మ్యాప్‌పై మెరుస్తున్న హైదరాబాద్‌లో ప్రయాణం రోజురోజుకూ సగటు పౌరుడికి ఒక నరకప్రాయ అనుభవంగా మారుతోంది. ఐటీ రంగానికి గుండెకాయ లాంటి గచ్చిబౌలి, మాదాపూర్ కారిడార్ల నుంచి జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వరకు ప్రయాణించాలంటే గంటల తరబడి రోడ్లపైనే నరకం చూడాల్సి వస్తోంది. ఇటీవల హెచ్-సిటీ ఫ్లైఓవర్, అండర్‌పాస్ పనుల నెపంతో కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ పోలీసులు వన్-వే విధానాన్ని అమలులోకి తీసుకురావడం ఈ సమస్యను మరింత జటిలం చేసింది. పైలట్ డ్రైవ్‌లు పూర్తి చేశామని అధికారులు చెప్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రత్యామ్నాయ మార్గాల అవగాహన లేక, అశాస్త్రీయమైన డైవర్షన్ల వల్ల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి.

### రోడ్లన్నీ గోతుల మయం

మరోవైపు గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్, బీహెచ్‌ఈఎల్, మియాపూర్ ప్రధాన రహదారులతో పాటు కనెక్టింగ్ రోడ్లు అన్నీ భారీ గోతులతో నిండిపోయాయి.

వర్షాలు పడినప్పుడల్లా మోకాటి లోతు నీరు చేరడం, ఆ గుంతల్లో వాహనాలు చిక్కుకుపోవడంతో ఐటీ ఉద్యోగుల రాకపోకలు గంటల కొద్దీ ఆలస్యమవుతున్నాయి. సీఎస్ఆర్, మున్సిపల్ రోడ్డు మరమ్మతుల పేరుతో ప్రచారం జరుగుతున్నా, వాస్తవానికి జిహెచ్‌ఎంసి, సైబరాబాద్ అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పనుల ప్రక్రియ నెమ్మదిగా సాగడం, మరమ్మతులకు వాడే క్వాలిటీ మెటీరియల్ లోపించడం వల్ల వాన పడగానే వేసిన ప్యాచ్ వర్క్‌లు కొట్టుకుపోయి రోడ్లు మళ్లీ అధ్వానంగా తయారవుతున్నాయి.




### అన్ని వైపుల నుంచి ఒకే సారి పనులు

ఇంతటి తీవ్రమైన సమస్యను ప్రభుత్వం, సంబంధిత శాఖలు సమర్థవంతంగా హ్యాండిల్ చేయలేకపోవడానికి ప్రధానంగా సమన్వయ లేమి కారణం. ట్రాఫిక్ పోలీస్, జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్, మంజీరా డిజైన్ టీమ్‌లు, రహదారుల నిర్మాణ సంస్థల మధ్య ముందస్తు ప్రణాళికలు ఉండటం లేదు. ఒకరు రోడ్డు వేస్తే, మరొకరు కేబుల్స్ లేదా పైప్‌లైన్ల కోసం దాన్ని తవ్వేస్తున్నారు. పైగా మౌలిక వసతుల ప్రాజెక్టులు చేపట్టేటప్పుడు వర్క్ స్పేస్ అంచనా వేసి

2లో..

# సీఎం విజయ్ వరాల మూట

## - ప్రతి ఎమ్మెల్యేకూ ప్రభుత్వ కారు, రూ. 25 లక్షల కవరేజ్



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ శాసనసభలో కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలకు ఆయన ఊహించని బంపర్ ఆఫర్ ప్రకటించి ఆశ్చర్యానికి గురిచేశారు. రాష్ట్రంలోని మొత్తం 234 మంది శాసనసభ్యులకు ప్రభుత్వం తరఫున అధికారిక వాహనం కేటాయిస్తున్నట్లు సీఎం విజయ్ ప్రకటించారు. అంతేకాకుండా డ్రైవర్, ఇంధనం, నిర్వహణ ఖర్చుల కోసం నెలకు రూ.75 వేలు అలవెన్స్‌తో పాటు, వ్యక్తిగత కార్యదర్శిని నియమించుకోవడానికి మరో రూ.25 వేల ప్రభుత్వ గ్రాంట్ అందజేయనున్నట్టు తెలిపారు. తమ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పారదర్శకంగా, అవినీతి రహితంగా పనిచేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. వీసీకే ఎమ్మెల్యే జోషిమణి విజ్ఞప్తి మేరకు పేద కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన మొదటిసారి ఎమ్మెల్యేలను ప్రోత్సహించేందుకు అధికారిక వాహనం ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. "ప్రజల సమస్యలను వినడానికి, ప్రభుత్వ ప్రాజెక్టులను పర్యవేక్షించడానికి ఎమ్మెల్యేలందరూ తమ నియోజకవర్గాల్లో పర్యటించాల్సి

2లో..

# పరకాలలో పోటీ చేసేది నేనే

## - నాకు కౌంటర్ ఇస్తే రేవంత్ రెడ్డి భాగోతాలు బయటపెడతా

**- ముఖ్యమంత్రి అయ్యాక కళ్లు నెత్తికెక్కాయా.. - బీసీలంటే అంత చులకనా..?**

**- రేవంత్ రెడ్డిపై కొండా సుష్మిత కామెంట్స్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కాంగ్రెస్‌లో పరకాల అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయాలు రోజురోజుకూ వేడెక్కుతున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల సభలో పిలుపునివ్వడం ఇప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. పరకాల నుంచి రేవూరిని మళ్లీ పోటీ చేయిస్తామని సీఎం ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తూ రేవంత్‌రెడ్డి, వరంగల్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి పొంగులేటిని శ్రీనివాస్ రెడ్డిని ఉద్దేశించి పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు.

2లో..

# మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ షోకాజ్ నోటీసులు

## - మూడు రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మంత్రి కూతురు కొండా సుస్మిత, సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో ఈ చర్యలు తీసుకుంది.

2లో..

# గ్రూప్-1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు

## - అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

**- గత ప్రభుత్వంలో గ్రూప్-1 పరీక్షల్లో భారీ అక్రమాలు జరిగాయన్న సీఎం**

**- ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులతో జవాబు పత్రాలు దిద్దించారని ఆరోపణ**

**- కోర్టు ఆదేశాలను ధిక్కరించి ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకనం అప్పగించారని ఆగ్రహం**

అమరావతి (ప్రశ్న న్యూస్) వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో చోటుచేసుకున్న తీవ్ర అక్రమాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. చివరకు గ్రూప్-1 స్థాయి అధికారులను ఎంపిక చేసే ఎగ్జామ్ పేపర్లను ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, ప్లంబర్లు, సెక్యూరిటీ గార్డులతో దిద్దించి, అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను పునరుద్ధరిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 344 నిబంధన కింద జరిగిన ప్రత్యేక చర్చలో భాగంగా, రాజ్యాంగంలోని ఆర్టికల్ 315 ప్రకారం అత్యంత పారదర్శకంగా పనిచేయాల్సిన ఏపీపీఎస్సీని గత పాలకులు నిర్వీర్యం చేశారని చంద్రబాబు ఆరోపించారు.

రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులకు ఎంతో కీలకమైన గ్రూప్-1 అధికారులను ఎంపిక చేసే ఈ వ్యవస్థలో, అభ్యర్థులు రాత్రింబవళ్లు శ్రమించి ఉద్యోగాలు సాధించడానికి ప్రయత్నిస్తే, వారి భవిష్యత్తుతో బరితెగించి ఆడుకున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ అనేది ప్రజలకు జవాబుదారీతనంతో విషయాలు వెల్లడించే ప్రాథమిక వేదిక కాబట్టి, ఈ విధ్వంసాన్ని ప్రజా క్షేత్రంలో స్పష్టంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు.

2లో..



# ప్రైవేటు వర్సిటీల ఏర్పాటు సులభతరం

## - అసెంబ్లీలో సవరణ బిల్లు ప్రవేశపెట్టిన లోకేశ్



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటు ప్రక్రియను సరళతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ మేరకు 'ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు 2026'ను విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. నిబంధనలను సరళతరం చేసి, ఉన్నత విద్యా రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తిగా తీసుకొచ్చిన 'జన్ విశ్వాస్' విధానంలో భాగంగానే ఈ సవరణలు చేస్తున్నట్లు మంత్రి లోకేశ్ వివరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అన్ని రంగాలకు

2లో..

# రష్యాలో డ్రోన్ దాడి

## - భారత వైద్య విద్యార్థికి గాయాలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రష్యా-ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో, రష్యాలోని ఉఫా నగరంలో జరిగిన డ్రోన్ దాడిలో ఒక భారతీయ విద్యార్థి గాయపడ్డారు. ప్రస్తుతం బాధితుడు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని మాస్కోలోని భారత రాయబార కార్యాలయం

2లో..

# బాబు.. అనే ఒక్క మాటతో ఛేదించిన హత్య మిస్టరీ

## - రూపారెడ్డి హత్య కేసులో షాకింగ్ విషయాలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కొండమల్లేపల్లిలో సంచలనం సృష్టించిన నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. పోలీసుల దర్యాప్తు ప్రకారం ఆమెకు పాఠాలు చెప్పిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులే ఈ ఘటనకు పాల్పడినట్లు తేలింది. దోపిడీ కోసమే ముందస్తు ప్రణాళికతో ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులు మైనర్లు కావడంతో వారి వివరాలను పోలీసులు వెల్లడించలేదు. హత్యకు ముందు చివరిగా వినిపించిన 'బాబు'. ఈ కేసు దర్యాప్తులో ఒక చిన్న మాటే కీలక ఆధారంగా మారింది. ఘటనకు ముందు రూపారెడ్డి తన చిన్నమ్మతో ఫోన్‌లో మాట్లాడిన సమయంలో చివరిగా "బాబు" అని పలికినట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో ఈ మాటపై పోలీసులు ప్రత్యేకంగా

2లో..



ఎన్నికలకు సిద్ధంకండి..

# గెలుపే లక్ష్యంగా పని చేయండి

## - రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ



అమరావతి (ప్రశ్న న్యూస్) మాజీ సీఎం జగన్ కీలక వ్యాఖ్యలు చేసారు. పార్టీ నేతలతో ప్రస్తుత రాజకీయాల పైన స్పందించిన జగన్ త్వరలో జరిగే స్థానిక సంస్థల పైన దిశా నిర్దేశం చేసారు. ప్రభుత్వం పైన వ్యతిరేక ప్రతీ వర్గం లో కనిపిస్తుందని చెప్పుకొచ్చారు. స్థానిక ఎన్నికలకు సిద్దం కావాలని సూచించారు. గెలుపే లక్ష్యంగా పని చేయాలని నిర్దేశించారు. బల ప్రయోగం చేసి స్థానిక ఎన్నికల్లో గెలిచే ప్రయత్నాలు చేస్తారని యుద్ధం చేయటంలో వెనుకడుగు వేయవద్దని జగన్ స్పష్టం చేసారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు,

2లో..

# ఇంటర్ బోర్డులో విజిలెన్స్ సోదాలు

## - మళ్లీ తెరపైకి 2019 ఫలితాల వివాదం!

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం మరోసారి వార్తల్లో నిలిచింది. నాంపల్లిలోని బోర్డు కార్యాలయంలో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గంటల పాటు ఈ సోదాలు నిర్వహించడంతో సిబ్బందిలో ఆందోళన నెలకొంది. 2019 నాటి ఇంటర్ ఫలితాల వివాదానికి సంబంధించి ఈ సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. అప్పట్లో ఫలితాల వెల్లడి బాధ్యతలను నిర్వహించిన గ్లోబరీనా టెక్నాలజీస్ సంస్థ అక్రమాలకు పాల్పడిందన్న ఆరోపణలు పెను దుమారం రేపాయి. మార్కుల కేటాయింపులో జరిగిన పొరపాట్ల కారణంగా పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు విజిలెన్స్ విభాగం విచారణ ప్రారంభించింది. ఇందులో భాగంగానే అధికారులు ఇంటర్ బోర్డు మాజీ కార్యదర్శి అశోక్‌ను విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సోదాలకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

జమ్మూకశ్మీర్ భారత్‌లో

# అంతర్భాగం

## - అమెరికా రాయబారి కీలక వ్యాఖ్య



శ్రీనగర్ (ప్రశ్న న్యూస్) జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, ఇక్కడికి రావడం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తున్న తొలి అమెరికా రాయబారి ఆయనే కావడం విశేషం. బుధవారం శ్రీనగర్‌లో ఆయన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో భేటీ అయ్యారు. ఈ సమావేశం అనంతరం సెర్గియో గోర్ మీడియాతో మాట్లాడుతూ,

2లో..

# హైదరాబాద్‌లో ట్రాఫిక్ నరకం

రాత్రి వేళల్లో వేగంగా పనులు పూర్తి చేయాల్సి ఉండగా, పగటిపూట కూడా ఆంక్షలు విధించి సివిల్ వర్క్స్ సాగదీస్తుండటం వల్ల ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కుదేలవుతోంది.

### ప్రజలు భరించలేనంత అసౌకర్యం

రాజకీయంగానూ ఈ అంశం ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంటోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఓటర్లు, ఐటీ రంగానికి చెందిన ప్రొఫెషనల్స్ ప్రభుత్వం అందించే మౌలిక వసతుల పట్ల అత్యంత సున్నితంగా ఉంటారు. ఒకవైపు పన్నులు చెల్లిస్తూ, మరోవైపు రోడ్లపై గంటల కొద్దీ వేచి చూడాల్సి రావడం వల్ల పరిపాలనా వైఫల్యం అనే ముద్ర బలంగా పడే ప్రమాదం ఉంది. ప్రతిపక్షాలు కూడా ఈ ట్రాఫిక్ కష్టాలను, వర్షాకాలంలో గుంతల రోడ్ల చిత్రాలను సోషల్ మీడియాలో హైలైట్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచుతున్నాయి. ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించేందుకు సైబరాబాద్ పరిధిలోని ఐటీ కంపెనీలతో ప్రభుత్వం చర్చించి స్టాగర్డ్ వర్కింగ్ అవర్స్, హైబ్రిడ్ డ్రైవ్‌లను ప్రోత్సహించడంతో పాటు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్న సూచనలు ప్రజల నుంచి వస్తున్నాయి.

### సమస్య నిర్వహణలేనే ఉందని నమ్ముతున్న ప్రజలు

హైదరాబాద్‌కు ట్రాఫిక్ అనేది కేవలం ఒక రవాణా సమస్య కాదు, అది నగరం ఆర్థిక పురోగతికి, గ్లోబల్ బ్రాండ్ ఇమేజ్‌కు ముడిపడి ఉన్న అంశం. అధికారులు మసకబారిన పాత ప్రణాళికలను పక్కనపెట్టి, ప్రజా ప్రతినిధులు, పోలీసు శాఖ , సివిల్ ఇంజనీరింగ్ విభాగాలను ఒకే తాటిపైకి తెచ్చి యుద్ధప్రాతిపదికన స్పందించకపోతే, ఈ ట్రాఫిక్ గందరగోళం ప్రభుత్వం పట్ల పట్టణ ప్రజల్లో తీవ్ర అసంతృప్తిగా రూపాంతరం చెందడం ఖాయం. భవిష్యత్ లో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేయవచ్చు కానీ ఇప్పుడు ప్రజలు భరించలేనంతగా కష్టపడితే ప్రభుత్వానికే ఇబ్బంది.

# సీఎం విజయ్ వరాల మూట

ఉంటుంది ఆర్థిక అండ లేని సభ్యులు, తొలిసారిగా ఎన్నికైన వారు తమ బాధ్యతలను అలసట లేకుండా నిర్వర్తించడంలో సహాయపడేందుకు, ఎమ్మెల్యేలందరికీ ప్రభుత్వ వాహనాలను అందిస్తున్నట్లు ప్రకటించడానికి నేను సంతోషిస్తున్నాను" అని విజయ్ తెలిపారు. విజయ్ ప్రకటనతో హర్షం వ్యక్తం చేస్తూ టీవీకే ఎమ్మెల్యే సింధు ఎంజీఆర్ సినిమాలోని పాట పాడగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. ఎమ్మెల్యేలకు కార్లు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ టీవీకే ఎమ్మెల్యే శబరి అయ్యంగారన్ తన గాథను వివరించారు. "నాకు కారు గానీ, ఉద్యోగం గానీ ఉండేవి కావు. కానీ మా నాయకుడు ఇప్పుడు మాకు ఉద్యోగాలు, కార్లు ఇచ్చారు. నేను చెన్నైకి రైలులోనే వస్తాను, ఇక అసెంబ్లీకి ఆటోలో వచ్చినప్పుడు, నేను ఎమ్మెల్యేనని చెబితే పోలీసులు నమ్మరు. నా గుర్తింపు కార్డు చూపించాల్సి వస్తుంది" అని వ్యాఖ్యానించారు. అయితే, ప్రధాన ప్రతిపక్షం డీఎంకే ఈ నిర్ణయంపై తీవ్రంగా మండిపడింది. 234 మంది శాసనసభ్యులకు కార్లు, నెలకు రూ.లక్ష అలవెన్స్ ఇవ్వడం అంటే ప్రజాధనాన్ని వృథా చేయడమేనంటూ ఆ పార్టీ అధికార ప్రతినిధి ఏ శరవణన్ విమర్శించారు.

## గ్రూప్-1 పేపర్లు దిద్దింది

# ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు

### ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం ప్రారంభం..

2019 నుండి 2024 మధ్య కాలంలో ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన విధ్వంసం రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను మాత్రమే కాకుండా, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని సైతం పూర్తిగా దెబ్బతీసిందని సీఎం విమర్శించారు. 2018లో విడుదల చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు దాదాపు 1.14 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, అందులో 325 మందిని షార్ట్‌లిస్ట్ చేయడం జరిగింది. సాధారణంగా పదో తరగతి పరీక్ష పత్రాలను కూడా పోలీసు ఎస్కార్ట్‌తో అత్యంత భద్రంగా తరలిస్తుంటే, రాష్ట్రాన్ని పాలించే ఉన్నతాధికారుల ఎంపిక పరీక్ష విషయంలో అన్ని నిబంధనలను గాలికి వదిలేసి తీవ్ర అవకతవకలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు డిజిటల్ మూల్యాంకనాన్ని పక్కన పెట్టి మాన్యువల్ మూల్యాంకనం చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, కోర్టును తప్పుదోవ పట్టిస్తూ అసత్య అఫిడవిట్లు సమర్పించారని దుయ్యబట్టారు. న్యాయస్థానం ఉత్తర్వుల తర్వాత అయినా పరిస్థితిని సరిదిద్దాల్సింది పోయి, మరొక కేసులో సీఐడీ స్వాధీనంలో ఉన్న 'హాయ్ లాండ్' కేంద్రంగా మాన్యువల్ ఎవాల్యుయేషన్ నిర్వహించేందుకు రూ.1.19 కోట్లకు జీవో జారీ చేశారని వెల్లడించారు. పబ్లిక్ సర్వీసు కమిషన్ నిబంధనలన్నింటినీ తుంగలో తొక్కి, ప్రైవేటు వ్యక్తులకు పేపర్ వాల్యుయేషన్ బాధ్యతలను అప్పగించారని ధ్వజమెత్తారు.

### గ్రూప్ 1 సిట్ రిపోర్టుతో వైసీపీకి చిక్కులు తప్పవా..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామకాల మూల్యాంకన అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కోర్టుకు సమర్పించిన నివేదిక వైఎస్‌ఆర్‌సీపీని తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాల వాల్యూయేషన్‌లో నిబంధనల ఉల్లంఘన, సీసీటీవీల తొలగింపు, ప్రైవేటు వ్యక్తులతో వ్యాల్యుయేషన్, ఓఎంఆర్ స్లిప్పుల రీ-ప్రింటింగ్ వంటి విస్తుగొలిపే నిజాలు ఫోరెన్సిక్ ఆధారాలతో సహా లభించాయి. నిర్దిష్ట అభ్యర్థులకు ప్రయోజనం చేకూర్చేందుకే ప్లాన్ ప్రకారం ఇదంతా జరిగిందని సిట్ నిర్ధారించింది. నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి, ఉన్నతాధికారుల నిర్ణయాలపై విచారణ సాగినప్పటికీ, రాజకీయ నాయకుల మద్దతు లేకుండా ఈ స్థాయిలో సీసీటీవీల తొలగింపు లేదా ఓఎంఆర్ రీ-ప్రింటింగ్ సాధ్యం కాదనే భావన వ్యక్తమవుతోంది. గతంలో సీఐడీ విచారణలో కొందరు అధికారులు ఉన్నత స్థాయి ఒత్తిళ్ల వల్లే నిబంధనలు మార్చామని చెప్పినట్లు వార్తలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఈ విచారణను రాజకీయ నాయకత్వం దిశగా పొడిగిస్తే నాటి సీఎంతో లేదా కీలక నేతలకు చిక్కులు తప్పవని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## మంత్రి కొండా సురేఖకు

# టీపీసీసీ షోకాజ్ నోటీసులు

ఈ వ్యాఖ్యలపై 3 రోజుల్లోగా స్పష్టమైన వివరణ ఇవ్వాలని టీపీసీసీ ఆదేశించింది. కొండా సుస్మిత కామెంట్స్‌పై స్పందించిన కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి స్పందించారు. కొండా సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కొండా సుస్మిత వ్యాఖ్యలు సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టను దెబ్బ తీసే విధంగా ఉన్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ లక్ష్మణ రేఖను ఎవరు అతిక్రమించిన చర్యలు తీసుకుంటాం అన్నారు. పూర్తి సమాచారాన్ని తెప్పించుకున్న తర్వాత కొండా సుస్మితపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో షబ్బీర్ అలీ, కొండా మురళీ వివాదంలో వారితో చర్చించి సమస్యను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఇటీవల రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికే నోటీసులు ఇచ్చామని మల్లు రవి తెలిపారు.

### ఎల్బీనగర్ కాంగ్రెస్ నేత జక్కిడి ప్రభాకర్ రెడ్డిపై వేటు

నగరంలోని ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత జక్కిడి ప్రభాకర్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ టీపీసీసీ నిర్ణయం తీసుకుంది. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ పాలకమండలి (బోర్డు) సభ్యురాలిని కులం పేరుతో దూషించినట్లు వచ్చిన ఆరోపణలపై ఆధారాలు లభించడంతో ఆయనపై ఈ సస్పెన్షన్ వేటు వేసింది.

### చిన్నా రెడ్డికి టీపీసీసీ నోటీసులు

తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నేత జి. చిన్నారెడ్డి ఇటీవల వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యవహారంలో మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాల్సిందిగా చిన్నారెడ్డిని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది.

# పరకాలలో పోటీ చేసేది నేనే

'సీఎం రేవంత్ రెడ్డిని నేను కొన్ని ప్రశ్నలు అడగదలుచుకున్నా. మీరు మొదట పీసీసీ కావాలని కోరుకున్నది కొండా సురేఖ, కొండా మురళి. ఆరోజు కొండా మరళి ఆదేశాల మేరకు కొండా సురేఖ పీసీసీగా రేవంత్ రెడ్డిని ప్రపోజ్ చేసింది. ఢిల్లీ స్థాయిలో కూడా కొండా సురేఖ ప్రపోజ్ చేసింది. పీసీసీ అయ్యాక మొట్టమొదటగా మా ఇంటికే వచ్చారు. ఆ రోజు మా ఇంటికి వచ్చి మా నాన్న కొండా మురళిని ఎమ్మెల్సీ చేస్తానని మాట ఇవ్వలేదా.? మైసమ్మ, ఎల్లమ్మ మీద ప్రమాణం చేసి చెప్పు. ఓ బీసీ బిడ్డ, ప్రజల మనిషికి ఎందుకు ఎమ్మెల్సీ ఇవ్వలేదని నేను అడుగుతున్నా. మీరు పరకాలకు వచ్చి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్ రెడ్డిని గెలిపించాలని చెప్పినవ్. అసలు ఎవరు రేవూరి ప్రకాశ్ రెడ్డి. పరకాల అంటే ఆయనకు తెలియదు. పరికాలకు రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలియదు. వచ్చే ఎన్నికలు ఎందుకు ఎప్పుడే రాజీనామా చేయమను చేసి గెలవమని చెప్పు. నువ్వు వచ్చి ప్రచారం చేయ్, రేవూరి గెలుస్తడా కొండా కుటుంబం నుంచి గెలుస్తరా తెలుస్తది. మేం లేకపోతే రేవూరి ప్రకాశ్ రెడ్డి గెలిచేవాడే కాదు. నాలుగైదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన వ్యక్తి మీకు ఎందుకు గుర్తొస్తలేదు. ముఖ్యమంత్రి అయితే కళ్లు నెత్తికెక్కినయా.? నాకు భయం లేదు. చావుకు కూడా బయపడను. మా నాన్న అలా పెంచాడు. ఇవాళ మీతో పాటు ఓ పొంగు ఉన్నది, ఆ పొంగు ఎక్కువ సేపు పొంగదు. నువ్వు ముఖ్యమంత్రివా, ఆయన ముఖ్యమంత్రా తెలియట్లేదు. ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రి పొన్నం ఫోటో వేయకుండా ఆ పొంగు ఫోటో వేశారు. బీసీలంటే అంత చులకనా.?' అని కొండా సుష్మిత హాట్ కామెంట్స్ చేశారు. సుస్మిత చేసిన తాజా వ్యాఖ్యల నేపథ్యంలో వరంగల్ పాలిటిక్స్ రసవత్తరంగా మారాయి. ఇప్పటికే సుష్మిత తాను పరకాల నుంచి పోటీ చేసేందుకు రెడీ అయ్యాయని హింట్ ఇస్తూ 'అప్ కమింగ్ ఎమ్మెల్యే పరకాల' అని ఇన్‌స్టా పోస్టు పెట్టారు.

# ప్రైవేటు వర్సిటీల ఏర్పాటు సులభతరం

విస్తరింపజేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఉన్నత విద్యా రంగంలో నియంత్రణలను సులభతరం చేస్తున్నామన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో వర్సిటీల సంఖ్య తక్కువగా ఉందని, ఈ సవరణల ద్వారా కొత్త సంస్థలను ప్రోత్సహించవచ్చని తెలిపారు. ఈ బిల్లులో పలు కీలక సవరణలు ప్రతిపాదించారు. ప్రధానంగా, ప్రైవేటు వర్సిటీ ఏర్పాటుకు అవసరమైన భూమిని 50 ఎకరాల నుంచి సీఆర్డీఏ, విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి నగరాల్లో 10 ఎకరాలకు, ఇతర ప్రాంతాల్లో 15 ఎకరాలకు తగ్గించారు. కనీస పెట్టుబడి నిబంధనను పూర్తిగా తొలగించి, కేసును బట్టి నిపుణుల కమిటీ నిర్ణయం తీసుకునేలా మార్పు చేశారు. ఎండోమెంట్ ఫీజును రూ.5 కోట్లకు పరిమితం చేశారు. బ్రౌన్‌ఫీల్డ్ వర్సిటీగా మారాలంటే యూజీసీ నిబంధనల ప్రకారం కనీసం 3.01 సీజీపీఏ తప్పనిసరి చేశారు. ఈ బిల్లు ద్వారా రాష్ట్రంలో రెండో మహిళా విశ్వవిద్యాలయంగా 'విష్ణు మహిళా విశ్వవిద్యాలయం' ఏర్పాటుకు మార్గం సుగమమైందని మంత్రి తెలిపారు. మా ప్రభుత్వ విధానం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అని, దరఖాస్తుల ప్రక్రియను 60 రోజుల్లో పూర్తి చేసేలా ఫాస్ట్ ట్రాక్ విధానాన్ని ఆన్‌లైన్‌లో తీసుకొస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ వంటి 22 పారిశ్రామిక క్లస్టర్లకు అనుగుణంగా వర్సిటీలలో పరిశోధనలను ప్రోత్సహించడమే లక్ష్యమని లోకేశ్ పేర్కొన్నారు. నాణ్యతలో రాజీ పడకుండా, పరిశ్రమలకు అనుసంధానంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే ఈ సవరణల ముఖ్య ఉద్దేశమని మంత్రి వివరించారు.

## మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ షోకాజ్ నోటీసులు

బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఉఫాలోని బష్కిర్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న ఈ విద్యార్థిపై డ్రోన్ దాడి జరిగినట్లు సమాచారం. ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం (ఎంబసీ) తక్షణమే స్పందించింది. గాయపడిన విద్యార్థితో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా సదరు విద్యార్థికి సంబంధించిన వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచారు. గత మూడు రోజులుగా రష్యా భూభాగంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులను తీవ్రతరం చేసింది. ఈ క్రమంలో, మాస్కోకు సుమారు 1,200 కిలోమీటర్ల దూరంలో ఉన్న కీలక పారిశ్రామిక నగరం ఉఫా లక్ష్యంగా దాడులు కొనసాగుతున్నాయి. ఇక్కడి చమురు శుద్ధి కర్మాగారంపై సైతం దాడులు జరిగినట్లు వార్తలు వెలువడుతున్నాయి.

## బాబు.. అనే ఒక్క మాటతో

# ఛేదించిన హత్య మిస్టరీ

దృష్టి సారించారు. రూపారెడ్డి పాఠశాలలో విద్యార్థులను సాధారణంగా "బాబు" అని పిలిచేవారని తెలుసుకున్న పోలీసులు దర్యాప్తును విద్యార్థుల వైపు మళ్లించినట్లు తెలిపారు.

### ఐదు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు

కేసును ఛేదించేందుకు దేవరకొండ డీఎస్పీ ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఫోరెన్సిక్ ఆధారాలు, వేలిముద్రలు, డాగ్ స్క్వాడ్, సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక ఆధారాలను పరిశీలించారు. సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో 70కి పైగా సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించడంతో పాటు 80 మందికిపైగా అనుమానితులను విచారించినట్లు పోలీసులు వెల్లడించారు.

### స్కూల్ రీఓపెన్ తర్వాత అనుమానాలు

హత్య అనంతరం పాఠశాలకు నాలుగు రోజుల సెలవులు ప్రకటించారు. పాఠశాల తిరిగి ప్రారంభమైన తర్వాత గైర్హాజరైన 13 మంది విద్యార్థులపై పోలీసులు ఆరా తీశారు. వారిలో ఐదుగురు పదో తరగతి విద్యార్థులు ఉన్నట్లు గుర్తించారు. ఆ ఐదుగురిలో ఇద్దరు విద్యార్థుల కదలికలు పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించాయి. వారు కొంతకాలంగా ఖర్చులు చేస్తూ కనిపించడంతో పోలీసులు వారి కదలికలపై నిఘా పెట్టినట్లు తెలిపారు.

### రూ.1.54 లక్షల నగదు.. దర్యాప్తులో కీలక మలుపు

దొనియాల ఎక్స్ రోడ్డు వద్ద బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించినట్లు సమాచారం. వారి వద్ద రూ.1.54 లక్షల నగదు లభించినట్లు పోలీసులు తెలిపారు. ఆ నగదులోని కొన్ని నోట్లపై అనుమానాస్పద మరకలు గుర్తించడంతో దర్యాప్తు మరింత వేగవంతమైంది. అనంతరం విచారణలో రూపారెడ్డి ఇంటి నుంచి నగదు తీసుకెళ్లినట్లు విద్యార్థులు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు.

### హత్యకు ముందే రెక్కీ

పోలీసుల దర్యాప్తు ప్రకారం.. ఘటనకు వారం రోజుల ముందే ఇంటి పరిసరాలను గమనిస్తూ ఇద్దరు విద్యార్థులు రెక్కీ నిర్వహించినట్లు తేలింది. ఇంట్లోకి వెనుక వైపు నుంచి ప్రవేశించి రూపారెడ్డిపై దాడి చేసి, ఇంట్లో ఉన్న నగదును తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.

కేసులో లభించిన ఆధారాలు, సీసీ కెమెరాల ఫుటేజీ, ఫోరెన్సిక్ పరిశీలన, సాంకేతిక విశ్లేషణ తదితర అంశాలను కలిపి పరిశీలించడంతో నిందితులను గుర్తించగలిగినట్లు అధికారులు తెలిపారు.

### మైనర్లు కావడంతో జువైనల్ జస్టిస్ బోర్డుకు

ఈ కేసులో నిందితులుగా గుర్తించిన ఇద్దరూ మైనర్లు కావడంతో వారి వ్యక్తిగత వివరాలను పోలీసులు వెల్లడించలేదు. వారిని జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరచనున్నట్లు జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వెల్లడించినట్లు సమాచారం.

### ఒక్క మాట.. ఎన్నో ప్రశ్నలకు సమాధానం

ఒక హత్య కేసులో పెద్దగా కనిపించని చిన్న ఆధారం ఎంత కీలకంగా మారుతుందో ఈ ఘటన మరోసారి చూపించింది. రూపారెడ్డి ఫోన్ సంభాషణలో చివరిగా వినిపించిన "బాబు" అనే ఒక్క మాటను పోలీసులు పట్టుకుని దర్యాప్తును ముందుకు తీసుకెళ్లడం, సీసీ కెమెరాలు, ఫోరెన్సిక్, సాంకేతిక ఆధారాలను సమన్వయం చేయడం చివరకు కేసు మిస్టరీ ఛేదనకు దారితీసినట్లు పోలీసులు తెలిపారు.

# ఎన్నికలకు సిద్ధంకండి..

# గెలుపే లక్ష్యంగా పని చేయండి

నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో తాజా పరిణామా ల పైన స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల పోరుకు సిద్ధం కావాలని సూచించారు. గెలుపే లక్ష్యంగా పని చేయాలని నిర్దేశించారు. వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని చెప్పుకొచ్చారు. ఏ ఒక్క వర్గమూ కూడా సంతోషంగా లేదని చెప్పారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకత స్థానిక ఎన్నికల్లో కనబడకుండా చేసేందుకు పోలీసులను ప్రయోగిస్తారని అన్నీ ఎదుర్కొని యుద్ధం చేయాలని సూచించారు. వైసీపీకి అత్యంత ప్రజాదరణ ఉందని చెప్పారు. అందుకే తప్పకుండా గెలుస్తామని ధీమా వ్యక్తం చేసారు. కాగా, రాష్ట్రంలో శాంతి భద్రతలు దిగజారాయని జగన్ ఆరోపించారు. ఇసుక, మట్టి, మద్యం మాఫియాలు చెలరేగుతున్నారని గంజాయి రవాణా చేస్తూ పోలీసులు పట్టుబడ్డారని విమర్శలు చేసారు.

### పార్టీ నేతలకు దిశా నిర్దేశం

రాజమండ్రిలో డాక్టర్ ప్రియాంకను దారుణంగా చంపారని ఆరోపించారు. కారుతో పదే పదే ఢీకొట్టి ప్రాణం తీశారని ఆవేదన వ్యక్తం చేసారు. అయినా కేసు బయటకు రాకుండా తొక్కి పెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అంత దారుణంగా పోలీసులు, అధికార పార్టీ వారు కుమ్మక్కై పని చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలందరికీ వెన్నుపోటు పొడిచిన వెన్నుపోటు పార్టీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు అంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ నిలబెట్టుకోలేదని విద్యార్థులు, రైతులు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, ఉద్యోగులు, వ్యాపారులు ఇలా ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేరని చెప్పారు. కూటమి ప్రభుత్వం మీద రెండేళ్లలోనే తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. అదే సమయంలో వైసీపీకి రోజు రోజుకీ ఆదరణ పెరుగుతోందని వివరించారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర మొదలవుతుందని చెప్పిన జగన్ ఆ తర్వాత ఏడాది ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా మనదే విజయం అంటూ జగన్ ధీమా వ్యక్తం చేసారు. నిత్యం ప్రజలతో మమేకమై పని చేయాలని పార్టీ నేతలకు నిర్దేశించారు.

## కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి వెన్నుముక్క ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటాను

### ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ప్రజల సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆమె సూచించారు. మండల కేంద్రమైన కొల్చారంలోని బాబా ఫంక్షన్ హాల్లో బుధవారం బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశానికి ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో అమలైన అనేక సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని బీఆర్ఎస్ విమర్శించారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్లు, స్కాలర్‌షిప్‌లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల విషయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కల్యాణలక్ష్మి విషయంలో కోర్టు కేసుకు కౌంటర్ దాఖలు చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని విమర్శిస్తూ, ఆడబిడ్డల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర పథకాలు అమలయ్యాయని గుర్తుచేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం పాత పథకాలను తొలగించడం తప్ప కొత్తగా ప్రజలకు ఉపయోగపడే పథకాలను అమలు చేయడం లేదని ఆరోపించారు. కేసీఆర్ రైతును రాజుగా తీర్చిదిద్దితే, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆమె విమర్శించారు. రైతుబీమా ప్రీమియం చెల్లింపుల విషయంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సంగారెడ్డి జిల్లాలో ఓ సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రి 24 గంటల విద్యుత్ అందుతోందని చెబుతుండగా, అధికారుల స్థాయిలో మాత్రం 12 గంటల విద్యుత్ అందుతోందనే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన హామీలకు, క్షేత్రస్థాయిలో అమలుకు పొంతన లేదని ఆమె ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై గతంలో తీవ్ర విమర్శలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అదే ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోస్తోందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అప్పులు సుమారు రూ.3.82 లక్షల కోట్లుగా ఉన్నాయని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రూ.8 లక్షల కోట్లుగా ప్రచారం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేసిన అభివృద్ధి పనులు మేం చెప్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ.3.5 లక్షల కోట్లకు పైగా అప్పులు తెచ్చి రాష్ట్రానికి ఏమి చేసిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఈడీ కేసులు, కమిషన్ల వేస్తూ ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో సత్యనిష్ఠ కొరవడిందని, మంత్రులు పరస్పరం విభేదాలతో పాలన సాగిస్తున్నారని విమర్శించారు.

### - కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నోరు అదుపులో ఉంచుకోవాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత అర్హత మర్చిపోయి ఎమ్మెల్యే పై అవాకులు చివాకులు పేలుతున్నారని, అమర్యాదకర సంబోధిస్తున్నారని పలువురు మండల బి ఆర్ ఎస్ నాయకులు మండిపడ్డారు. వారిది ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి కాదని దమ్ముంటే తమతో చర్చకు రావాలని సవాల్ విసిరారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగే రమేష్ మాట్లాడుతూ ఎలక్షన్ల సమయంలో కాంగ్రెస్ జిల్లా పార్టీ అధ్యక్షులు తమపై కలెక్టర్కు నిరాధారమైన ఫిర్యాదులు చేశారని దమ్ముంటే తాను చేసిన ఆరోపణలు రుజువు చేయాలన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిని బ్రోకర్ అని సంబోధిస్తారని ఎద్దేవా చేశారు. ఇదిలా ఉండగా, పార్టీ బలోపేతంలో భాగంగా గ్రామాల్లో ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కార్యకర్తలకు సూచించారు. అన్యాయంగా తొలగించబడిన ఓట్లను గుర్తించి సరిచేయడంతో పాటు అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. నాయకులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి యువతకు, కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా అర్ధరాత్రి అయినా అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తేనే రాష్ట్ర ప్రజల కష్టాలు తీరుతాయని ఎమ్మెల్యే తో పాటు బీఆర్ఎస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ లెదర్ టెక్నాలజీ

# పాలిటెక్నిక్ కాలేజ్ వద్ద విద్యార్థుల ఆందోళన

### - విద్యార్థుల పై పోలీసుల దాడి ఆరోపణలు....

రాయదుర్గం పీఎస్ పరిధిలోని ఖాజాగూడ ప్రభుత్వ లెదర్ టెక్నాలజీ పాలిటెక్నిక్ కాలేజ్ ఎదుట విద్యార్థులు చేపట్టిన ధర్నా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పాలిటెక్నిక్ (ాబఖ) విద్యా విధానంలో మార్పులు, యూత్ స్కిల్ యూనివర్సిటీ ప్రతిపాదనలు రద్దు చేసి 'లేటరల్ ఎంట్రీ'ని యథావిధిగా కొనసాగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.?నిరసన తెలుపుతున్న విద్యార్థులను అడ్డుకునే క్రమంలో పోలీసులు తమపై దాడి చేశారని విద్యార్థులు ఆరోపించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విద్యార్థులను నిలువరించే ప్రయత్నం చేయడంతో అక్కడ తోపులాట చోటుచేసుకుంది. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని విద్యార్థులు స్పష్టం చేయడంతో ఆందోళన కొనసాగుతోంది.

# జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం

"భారత్‌లో ఇది అత్యంత కీలకమైన ప్రాంతం. నేను ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. ఇది ఎంతో రమణీయమైన ప్రదేశం" అని కొనియాడారు. కశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు మెరుగుపడిన నేపథ్యంలో, అమెరికా పౌరుల కోసం జారీ చేసిన ప్రయాణ హెచ్చరికలను (ట్రావెల్ అడ్వైజరీ) సడలించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పలువురు అమెరికన్లు ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు. ఈ పర్యటనలో భాగంగా రాయబారి సెర్గియో గోర్, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కూడా సమావేశం కానున్నారు. అనంతరం గురువారం ఆయన లద్దాఖ్‌లో పర్యటించనున్నారు. కాగా, కశ్మీర్ సమస్యలు ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన అంతర్గత విషయాలని, ఇందులో వాషింగ్టన్ జోక్యం అవసరం లేదని, అందుకే అమెరికా రాయబారితో ఈ అంశాలను ప్రస్తావించబోనని ఒమర్ అబ్దుల్లా ఈ పర్యటనకు ముందే స్పష్టం చేశారు.

# నేడు ప్రజా ప్రెస్‌క్లబ్ తొలి వార్షికోత్సవం

### ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వసంత, మాజీ మంత్రి జవహర్

### ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహణకు ఏర్పాట్లు

ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్) ఇబ్రహీంపట్నం కేంద్రంగా నిర్వహిస్తున్న ప్రజా ప్రెస్‌క్లబ్ తొలి వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక ఏఈ అసోసియేషన్ హాల్లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, జర్నలిస్టులు హాజరుకానున్నారు. కార్యక్రమానికి మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణ ప్రసాద్, ఎస్సీ కమిషన్ చైర్మన్, మాజీ మంత్రి కె.ఎస్. జవహర్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్, జనసేన మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అక్కల రామమోహన్‌రావు (గాంధీ), టీడీపీ రాష్ట్ర సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య తదితరులు పాల్గొననున్నారు.

#### జర్నలిస్టులకు ఆహ్వానం

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, ప్రజలకు--ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవడంలో పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులందరూ వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ప్రజా ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో పలువురు రాజకీయ, సామాజిక రంగ ప్రముఖులు, అధికారులు పాల్గొని జర్నలిస్టులతో తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. జర్నలిస్టు మిత్రులంతా అధిక సంఖ్యలో హాజరై ప్రజా ప్రెస్‌క్లబ్ తొలి వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# రైల్వే బ్రిడ్జి పేరుతో ఇళ్లు ఖాళీ చేయాలా.?

### 70 ఏళ్లుగా నివాసం.. డీ-ఫారం పట్టాలు ఉన్నా తొలగింపునకు హెచ్చరికలు

### ప్రత్యామ్నాయ నివాసాలు చూపించాలంటున్న దళిత కుటుంబాలు



కొండపల్లి(ప్రశ్న న్యూస్) రైల్వే బ్రిడ్జి నిర్మాణం పేరుతో కొండపల్లి-ఈలప్రోలు రైల్వే గేటు సమీపంలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న దళిత కుటుంబాల ఇళ్లను ఖాళీ చేయాలని రైల్వే శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేయడం కలకలం రేపుతోంది. సుమారు 70 ఏళ్లుగా అక్కడే నివాసం ఉంటున్నామని, తమ నివాస స్థలాలకు ప్రభుత్వం డీ-ఫారం పట్టాలు కూడా మంజూరు చేసిందని స్థానికులు చెబుతున్నారు.రైల్వే గేటు సమీపంలో ఎస్సీ వర్గాలకు చెందిన పలు కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నాయి. ప్రభుత్వం తమకు నివాస స్థలాలకు సంబంధించి డీ-ఫారం పట్టాలు మంజూరు చేసిందని, అప్పటి నుంచి ఇళ్లను నిర్మించుకుని నివసిస్తున్నామని స్థానికుడు సలికిటి ఏసురత్నం తెలిపారు. ఇళ్లకు సంబంధించిన పన్నులు సైతం చెల్లిస్తున్నామని పేర్కొన్నారు.అయితే రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో ఇళ్లను తక్షణమే ఖాళీ చేయాలంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో నివాసితుల్లో ఆందోళన నెలకొంది. ఎటువంటి ప్రత్యామ్నాయ నివాస ఏర్పాట్లు చూపకుండా ఉన్నపళంగా ఇళ్లు ఖాళీ చేయాలని చెప్పడం సరికాదని బాధిత కుటుంబాలు వాపోతున్నాయి.

#### ప్రత్యామ్నాయ నివాసాలు కల్పించాలి

తమను ఖాళీ చేయించే ముందు ప్రత్యామ్నాయ నివాస గృహాలు లేదా నివాస స్థలాలు చూపించాలని సలికిటి ఏసురత్నం అధికారులను కోరారు. ఈ మేరకు అధికారులకు అర్జీలు సమర్పించినట్లు తెలిపారు. దశాబ్దాలుగా నివసిస్తున్న కుటుంబాలను ఒక్కసారిగా ఇళ్ల నుంచి తరలిస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పునరావాసం కల్పించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు మద్దతుగా ఎన్‌సీపీఐయూ నాయకుడు కలకోటి బసవయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మారాబత్తుల గోపాల్ మాదిగ, వై.ఎస్. రాజు మాదిగ, వ్యర్థపాటి ప్రసాద్ మాదిగ, కటారపు మనోహర్ మాదిగ, కట్టవరపు రత్నం మాదిగ తదితరులు పాల్గొన్నారు.రైల్వే అభివృద్ధి పనులకు తాము వ్యతిరేకం కాదని, అయితే దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేద దళిత కుటుంబాలను ప్రత్యామ్నాయ పునరావాసం కల్పించకుండా ఖాళీ చేయించవద్దని వారు కోరారు. బాధితుల సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే పరిశీలించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# డోర్నకల్‌లో కోఆప్షన్ సభ్యుల ఎంపిక




డోర్నకల్ మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుల ఎంపిక కార్యక్రమం ఘనంగా జరిగింది.ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని, వివిధ సామాజిక వర్గాలకు చెందిన కోఆప్షన్ సభ్యులుగా ఎంపికైన ఎస్.కె. ఖాదర్ బాబా (మైనార్టీ), శీలం భార్గవ్ (బీసీ), ఎపూరి కృష్ణ (ఎస్సీ)లకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొండేటి రాజకుమారి, వైస్ చైర్మన్ మాద లావణ్యతో పాటు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఎంపికైన సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, డోర్నకల్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# మైలవరంలో 'బోగస్ బస్సుల' బాగోతం

### గుంటూరు కాలేజీ పేరుతో బస్సులు.. మైలవరం ప్రైవేట్ కాలేజీ వినియోగం.?

### కాలేజీ పేరు లేకుండానే విద్యార్థుల రవాణా.. నిబంధనలకు తూట్లు.?

### ఆర్టీవో, ఇంటర్ బోర్డు అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

### విద్యార్థుల భద్రతపై ఎస్ఎఫ్ఐ ఆందోళన.. విచారణకు డిమాండ్





మైలవరం (ప్రశ్న న్యూస్) మైలవరం పట్టణంలోని ఓ ప్రైవేట్ కాలేజీ బస్సుల వ్యవహారం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. గుంటూరు జిల్లాకు చెందిన ఓ ఇంజనీరింగ్ కాలేజీకి సంబంధించిన బస్సులను మైలవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీ విద్యార్థుల రవాణాకు ఉపయోగిస్తోందని విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ ఆరోపించింది. కొన్ని బస్సులపై సంబంధిత కాలేజీ పేరు కూడా లేకుండానే గత రెండు నెలలుగా విద్యార్థులను రవాణా చేస్తున్నారనే ఆరోపణలు రావడంతో విద్యార్థుల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బస్సులు ఏ కాలేజీకి చెందినవి? వాటి అనుమతులు ఎవరిపేరుతో ఉన్నాయి? ఏ విద్యాసంస్థ విద్యార్థులను రవాణా చేయడానికి ఆ బస్సులకు అనుమతి ఇచ్చింది? ఫిట్‌నెస్, పర్మిట్లు, ఇన్సూరెన్స్, డ్రైవర్ అర్హతలు, విద్యార్థుల రవాణాకు సంబంధించిన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి. ఈ వ్యవహారంపై అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

#### 'బస్సులు ఎవరివి.?'.. అసలు కథేంటి.?

ఎస్ఎఫ్ఐ మైలవరం మండల కమిటీ నాయకుల ఆరోపణల ప్రకారం.. గుంటూరు ప్రాంతానికి చెందిన ఓ ఇంజనీరింగ్ కాలేజీకి సంబంధించిన బస్సులను మైలవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీ విద్యార్థుల రవాణాకు ఉపయోగిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే కొన్ని బస్సులపై ప్రస్తుతం విద్యార్థులు చదువుతున్న కాలేజీ పేరు లేకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోందని వారు అంటున్నారు గత రెండు నెలలుగా ఈ బస్సుల ద్వారా విద్యార్థులను రవాణా చేస్తున్నప్పటికీ సంబంధిత విద్యాసంస్థ పేరు స్పష్టంగా ప్రదర్శించకపోవడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులను తరలించే ప్రతి వాహనం ఏ సంస్థకు చెందినదో స్పష్టంగా తెలిసేలా వివరాలు ఉండాల్సిన అవసరం ఉందని, వాహనం యాజమాన్యం, అనుమతులు, విద్యార్థుల రవాణాకు సంబంధించిన నిబంధనలను అధికారులు పరిశీలించాలని ఎస్ఎఫ్ఐ కోరుతోంది.

#### విద్యార్థులకు ఏదైనా జరిగితే బాధ్యత ఎవరిది.?

విద్యార్థుల రవాణా విషయంలో చిన్న నిర్లక్ష్యం కూడా తీవ్ర పరిణామాలకు దారితీసే అవకాశం ఉందని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. బస్సు ప్రమాదానికి గురైతే, విద్యార్థికి గాయమైతే లేదా మరేదైనా అనుకోని ఘటన చోటుచేసుకుంటే బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్నించారు. బస్సుపై కాలేజీ పేరు లేకపోతే అత్యవసర సమయంలో తల్లిదండ్రులు, అధికారులు ఆ వాహనం ఏ విద్యాసంస్థకు సంబంధించినదో ఎలా గుర్తిస్తారని నిలదీశారు. విద్యార్థుల భద్రతను ఏ మాత్రం తేలిగ్గా తీసుకోరాదని, అన్ని వాహనాలను సంబంధిత శాఖల అధికారులు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు.

#### ఆర్టీవో అధికారులు ఎక్కడ.?

విద్యార్థులను రవాణా చేస్తున్న బస్సులకు అవసరమైన పర్మిట్లు ఉన్నాయా? వాహనాల ఫిట్‌నెస్ సక్రమంగా ఉందా? ఇన్సూరెన్స్ అమల్లో ఉందా? డ్రైవర్లకు అవసరమైన అర్హతలు ఉన్నాయా? తదితర అంశాలపై ఆర్టీవో అధికారులు తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు.ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన బస్సుల విషయంలో అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహించడం కాకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

#### ఇంటర్ బోర్డు పర్యవేక్షణ ఏది.?

విద్యార్థుల విద్యా వ్యవహారాలతో పాటు వారి భద్రత, కాలేజీల నిర్వహణలో నిబంధనల అమలుపైనా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధిత ఇంటర్ విద్యాశాఖ పర్యవేక్షణ అధికారులు ఉన్నారా? ఉంటే ప్రైవేట్ కాలేజీలపై వారి పర్యవేక్షణ ఎలా ఉందని ప్రశ్నించారు.
కాలేజీ నిర్వహణ, విద్యార్థుల రవాణా, తరగతుల సమయాలు, ఫీజుల వసూళ్లు తదితర అంశాలపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు పరిశీలించాలని కోరారు.

#### గుర్తింపు ఒకరిది.. నిర్వహణ మరొకరిదా.?

కాలేజీకి సంబంధించిన గుర్తింపు, ప్రచార పత్రాలు, బస్సులపై కనిపించే పేర్ల మధ్య స్పష్టత లేదని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపిస్తున్నారు. ఒక పేరుతో ప్రచారం చేస్తూ, మరో పేరుతో బస్సులను నడిపిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు వాస్తవాలను తేల్చాలని డిమాండ్ చేశారు.
విద్యార్థులు, తల్లిదండ్రులకు ఒక సంస్థ గురించి ఒక విధమైన సమాచారం ఇచ్చి, వాస్తవ నిర్వహణ మరో విధంగా ఉంటే అది తీవ్ర సమస్యగా మారుతుందని పేర్కొన్నారు. విద్యాసంస్థకు సంబంధించిన గుర్తింపు, అనుమతులు, బస్సుల వివరాలు, ఫీజుల నిర్మాణం వంటి అంశాలను బహిరంగంగా స్పష్టం చేయాలని కోరారు.

#### కాలేజీ సమయాలపైనా ఆరోపణలు

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రాత్రి 7 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలను ఎస్ఎఫ్ఐ నాయకులు చేశారు. విద్యార్థులను ఎక్కువ సమయం కాలేజీలో ఉంచడం వల్ల వారి మానసిక ఒత్తిడి, ప్రయాణ భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాలేజీ సమయాల విషయంలో సంబంధిత అధికారులు నిబంధనలను పరిశీలించి, వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని డిమాండ్ చేశారు.

#### యూనిఫామ్ పేరుతో రూ.1,000.. పుస్తకాల పేరుతో రూ.7,000?

కాలేజీలో ఫీజుల వసూళ్లపైనా ఎస్ఎఫ్ఐ తీవ్ర ఆరోపణలు చేసింది. యూనిఫామ్ పేరుతో విద్యార్థుల నుంచి రూ. 1,000, పుస్తకాల పేరుతో రూ. 7,000 వసూలు చేశారని నాయకులు ఆరోపించారు. వీటితో పాటు ఇతర ఫీజులు కూడా అడ్డగోలుగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన రసీదులు, అధికారిక ఫీజు వివరాలు, తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది. ఫీజుల విషయంలో పారదర్శకత ఉండాలని, విద్యార్థులు, తల్లిదండ్రులకు పూర్తి వివరాలు తెలియజేయాలని ఎస్ఎఫ్ఐ కోరింది.

#### గత కాలేజీతో పోలిక

గతంలో ఇదే ప్రాంతంలో ఎస్వీఆర్‌జీ కాలేజీ నిర్వహణ సమయంలో ప్రశాంతమైన వాతావరణం ఉండేదని, విద్యార్థుల్లో చైతన్యం, తల్లిదండ్రులకు గౌరవం ఉండేదని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. విద్యా ఫలితాలు కూడా మెరుగ్గా ఉండేవని తెలిపారు. ప్రస్తుతం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని, విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతోందని ఆరోపించారు. విద్యాసంస్థలు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని, వ్యాపార ధోరణికి ప్రాధాన్యం ఇవ్వకూడదని సూచించారు.

#### ఎస్ఎఫ్ఐ ఆందోళన.. బస్సులపై పేర్లు తప్పనిసరి

ఈ ఆరోపణలు, విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాలపై ఎస్ఎఫ్ఐ మైలవరం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా కాలేజీ బస్సులపై ఉన్న గుంటూరు జిల్లా ఇంజనీరింగ్ కాలేజీ పేర్లను తొలగించినట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. అయితే బస్సులపై ఉన్న పేర్ల తొలగింపు మాత్రమే సమస్యకు పరిష్కారం కాదని, సంబంధిత శాఖల అధికారులు వాహనాల పత్రాలు, పర్మిట్లు, ఫిట్‌నెస్, యాజమాన్యం, విద్యార్థుల రవాణా అనుమతులు తదితర అంశాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని కోరుతున్నారు.

#### 'రేపటి నుంచి ప్రతి బస్సుపై కాలేజీ పేరు ఉండాలి'

కాలేజీ ప్రిన్సిపాల్ మూర్తిని కలిసి విద్యార్థుల రవాణాకు ఉపయోగించే ప్రతి బస్సుపై సంబంధిత కాలేజీ పేరు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరినట్లు తెలిపారు.
బస్సుల వివరాలు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయకపోతే, విద్యార్థుల భద్రతపై అధికారులు స్పందించకపోతే తమ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మైలవరం మండల అధ్యక్షుడు ఎ. దుర్గారావు, ఉపాధ్యక్షులు చైతన్య, సిద్ధు, సహాయ కార్యదర్శులు జస్వంత్, బాలు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

#### అధికారుల విచారణకు డిమాండ్

మొత్తంగా మైలవరంలోని ప్రైవేట్ కాలేజీ బస్సుల వ్యవహారం విద్యార్థుల భద్రతపై చర్చకు దారితీసింది. ఎస్ఎఫ్ఐ చేసిన ఆరోపణల్లో వాస్తవమెంత? బస్సులు ఏ సంస్థకు చెందినవి? వాటికి ఎవరి పేరుతో అనుమతులు ఉన్నాయి? విద్యార్థులను రవాణా చేయడానికి అవసరమైన పర్మిట్లు ఉన్నాయా? వాహనాల ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ సక్రమంగా ఉన్నాయా?

కాలేజీ బస్సులపై సంస్థ పేరు ఎందుకు లేదనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల భద్రత విషయంలో రాజీ పడకుండా ఆర్టీవో, ఇంటర్ విద్యాశాఖ, ఇతర సంబంధిత అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు.

# ములుగు జిల్లా ఎస్పీ సమీక్ష

### - సైబర్ నేరాలపై విస్తృత అవగాహనకు ఆదేశం- ఉత్తమ విధులు నిర్వహించిన పోలీసు సిబ్బందికి రివార్డు సర్టిఫికెట్ల ప్రదానం

### - కోర్టు కేసుల్లో సాక్షుల హాజరు, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై కఠిన చర్యలు అవసరం: ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్



ములుగు(ప్రశ్నన్యూస్)నేరాల నియంత్రణ, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్, ఐపీఎస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని ఎస్పీ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తులు, రాబోయే సవాళ్లు, ప్రజా భద్రత అంశాలపై విస్తృతంగా చర్చించారు.

#### నిబద్ధతతో విధులు నిర్వహించాలి.

సమావేశంలో మాట్లాడిన ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్ విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ నిబద్ధత, పారదర్శకత కలిగి ఉండాలని సూచించారు. పక్షపాతం లేకుండా అందరినీ సమానంగా చూడాలి. బాధితులందరికీ న్యాయం జరిగేలా చూడటమే మన తొలి ప్రాధాన్యం" అని అధికారులకు దిశానిర్దేశం చేశారు.కోర్టులో విచారణలో ఉన్న కేసుల పురోగతిపై ఆరా తీశారు. ప్రతి కేసులోనూ సాక్షులకు, ముద్దాయిలకు తప్పనిసరిగా సమన్లు అందేలా చూడాలని, కోర్టు కానిస్టేబుళ్లు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. నేరస్తులకు శిక్ష పడేలా బలమైన సాక్ష్యాలతో ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలని స్పష్టం చేశారు.

#### రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

జిల్లాలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని ఎస్పీ ఆదేశించారు. వారి వివరాలను రెగ్యులర్‌గా అప్డేట్ చేయాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే సమాచారం రాబట్టాలని సూచించారు.
ఈ నెలలో నమోదైన కేసులను పోలీస్ స్టేషన్ వారీగా సమీక్షించిన ఎస్పీ, దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి ఫైల్‌ను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఆదేశించారు. దొంగతనాలు, ఆర్థిక నేరాల్లో బాధితులకు పోగొట్టుకున్న సొమ్ము, వస్తువులు తిరిగి అప్పగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

#### సైబర్, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై ఉక్కుపాదం

యువత ఆన్‌లైన్ బెట్టింగ్ ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టపోతున్న నేపథ్యంలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌ను ప్రోత్సహించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.అదేవిధంగా సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీల పేరుతో జరుగుతున్న మోసాల గురించి గ్రామాల వరకు ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు.

#### ఇతర కీలక ఆదేశాలు

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, చెక్‌పోస్టుల వద్ద సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశం.
ప్రజల్లో అవగాహన పెంచి కొత్త సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని సూచన.రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశం. మహిళలపై జరిగే నేరాలను ప్రాధాన్యతగా తీసుకుని వేగంగా విచారణ పూర్తి చేయాలని స్పష్టీకరణ.

#### ఉత్తమ సేవలకు గుర్తింపు.

సమావేశం అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డు సర్టిఫికెట్లు అందజేశారు. కష్టపడి పని చేసే వారికి ఇది ప్రోత్సాహకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్, ఐపీఎస్, డీసీఆర్‌బీ డీఎస్పీ కిషోర్, ములుగు డీఎస్పీ రవీందర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కుమార్, సీఐలు దయాకర్, సూర్య ప్రకాష్, సురేష్, రమేష్, ఆర్ఐలు, ఎస్ఐలు, ఐటీ కోర్ టీం, డీసీఆర్‌బీ సిబ్బంది పాల్గొన్నారు..

# విశాఖ ఇక విశాఖ మాత్రమే కాదు.. ఏఐ పట్నం


**విశాఖకు 'ఏఐ రెక్కలు'.. డేటా సెంటర్లకు గ్రీన్‌సిగ్నల్**

**6.5 గిగావాట్ల డేటా సెంటర్ల లక్ష్యం పూర్తి**

**పరిశ్రమల కోటా నీటిలో నుంచే డేటా కేంద్రాలకు సరఫరా**

**గ్రీన్ ఎనర్జీతోనే 70 శాతం విద్యుత్ వినియోగం**

**ఐటీ అనుబంధ పరిశ్రమలతో వేలాది ఉద్యోగాలు: మంత్రి లోకేశ్**



అమరావతి (ప్రశ్న న్యూస్) విశాఖపట్నాన్ని దేశంలోనే కీలకమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. డేటా సెంటర్ల ఏర్పాటుపై కొందరు కావాలనే అపోహలు, దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజలు వాటిని నమ్మాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో 6.5 గిగావాట్లకు మించకుండా డేటా సెంటర్ల లక్ష్యాన్ని పూర్తి చేశామని వెల్లడించారు. అసెంబ్లీలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చిన మంత్రి.. డేటా సెంటర్ల వల్ల నీటి వినియోగం, విద్యుత్ అవసరం, పర్యావరణం, ఉద్యోగాలపై వస్తున్న సందేహాలను వివరంగా ప్రస్తావించారు.

## విశాఖకు నీటి కొరత రానివ్వం

గోదావరి నుంచి ఐదేళ్ల సగటును పరిశీలిస్తే ఏటా సుమారు 3,000 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిపోతోందని లోకేశ్ తెలిపారు. అందులో కొంత నీటిని పోలవరం ద్వారా గ్రావిటీతో విశాఖకు తీసుకొచ్చే చర్యలు కొనసాగుతున్నాయన్నారు. 6.5 గిగావాట్ల డేటా సెంటర్లు పూర్తిస్థాయిలో ఏర్పాటైతే సుమారు 3 టీఎంసీల నీరు అవసరమవుతుందని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భవిష్యత్తులో నీటి వినియోగం మరింత తగ్గుతుందని తెలిపారు. తాను అమెరికాలోని పోలో ఆల్టోలో ఇంటెల్ డేటా సెంటర్‌ను స్వయంగా పరిశీలించానని, అక్కడ వాటర్ కూలింగ్‌కు బదులుగా ఎయిర్ కూలింగ్ సాంకేతికతను వినియోగిస్తున్నారని వివరించారు. డేటా సెంటర్లు--ఐటీ ఎకోసిస్టమ్, అనకాపల్లి ఫార్మా తయారీ, స్టీల్ ఎకోసిస్టమ్‌లను సమన్వయంతో అభివృద్ధి చేసి ఆంధ్రప్రదేశ్‌ను కొత్త పారిశ్రామిక, సాంకేతిక శక్తిగా తీర్చిదిద్దుతామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యలకు 'ప్రజా ప్రెస్‌క్లబ్' వేదిక కావాలి: వెంకట్

**ప్రజా ప్రెస్‌క్లబ్ తొలి వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు**

**ఐక్యతతో ముందుకు సాగుతూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలి**

ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్) ప్రజా ప్రెస్‌క్లబ్ తొలి వార్షికోత్సవం సందర్భంగా ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, గౌరవ జర్నలిస్టు మిత్రులందరికీ ప్రజా ప్రశ్న ఏపీ బ్యూరో వెంకట్ హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా వాటి పరిష్కారం కోసం ప్రజల తరఫున ప్రశ్నించే వేదికగా ప్రజా ప్రెస్‌క్లబ్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలు, కష్టాలు, అవసరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే దిశగా ప్రెస్‌క్లబ్ తనదైన పాత్ర పోషించాలని అన్నారు.

### ఐక్యతే బలం..

జర్నలిస్టులంతా ఐక్యతతో ముందుకు సాగుతూ సమాజహితం కోసం మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహించాలని వెంకట్ ఆకాంక్షించారు. జర్నలిస్టుల సంక్షేమంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజలకు అండగా నిలిచే సంస్థగా ప్రజా ప్రెస్‌క్లబ్ ఎదగాలని అన్నారు. ప్రెస్‌క్లబ్ దినదినాభివృద్ధి చెందుతూ, ప్రజల విశ్వాసాన్ని చూరగొని, సమాజంలో మరింత మంచి పేరు సంపాదించుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ప్రజా ప్రెస్‌క్లబ్ మరెన్నో వార్షికోత్సవాలు ఘనంగా జరుపుకోవాలని, ప్రజా సేవలో మరిన్ని మైలురాళ్లు అధిగమించాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షులు, సభ్యులు, జర్నలిస్టు మిత్రులందరికీ మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ప్రజా ప్రశ్న ఏపీ బ్యూరో వెంకట్ తెలిపారు.

# రాష్ట్ర వ్యాప్త ఏజెన్సీ బంద్ విజయవంతం: తుడుందెబ్బ

**5వ షెడ్యూల్, పేసా అమలు చేయాలని తుడుందెబ్బ డిమాండ్**

**ఏజెన్సీలో 100% ఉద్యోగాలు ఆదివాసులకే ఇవ్వాలన్న డిమాండ్‌తో బంద్**

**ఏజెన్సీ బంద్‌కు అపూర్వ స్పందన**



చర్ల (ప్రశ్న న్యూస్)ఆదివాసీ హక్కుల పోరాట సమితి 'తుడుందెబ్బ' పిలుపు మేరకు బుధ వారం రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో బంద్ పూర్తిగా విజయవంతమైంది.

తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా చర్ల పట్టణంలో విద్యా సంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలన్నీ స్వచ్ఛందంగా మూసివేశారు. రహదారులపై రాకపోకలు కూడా నిలిచిపోయాయి.

ఈ సందర్భంగా నిర్వహించిన ధర్నాలో తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్‌ను, ఏజెన్సీ హక్కులు 1/59, 1/70లను, 1996 పేసా చట్టాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### ప్రధాన డిమాండ్లు..

- ఏజెన్సీ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగ అవకాశాలు ఆదివాసులకే కల్పించేందుకు ప్రత్యేక జీవో ఇవ్వాలి
- జీవో నెం.109 ప్రకారం 75 శాతం పోస్టులు ఆదివాసులకు కేటాయించాలి
- 1/70 చట్టం: గిరిజనేతరులు చేస్తున్న కుట్రలను తుడుందెబ్బ ఉద్యమం ద్వారా ఎదుర్కొంటామని హెచ్చరించారు
- ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ సీనియర్ నాయకులు తాటి రామకృష్ణ, మండల నాయకులు పురిటి ప్రశాంత్, కోరం మృగరాజు, సప్క మధు తదితరులు పాల్గొన్నారు.

# ఎంటీఎంసీ ఎన్నికలపై.. పెరుగుతున్న ఉత్కంఠ

**షెడ్యూల్ కోసం ఎదురుచూపులు.. వార్డుల పునర్విభజన, రిజర్వేషన్లపై ఆసక్తి**

**ప్రధాన పార్టీల్లో అప్పుడే కదలిక.. ఆశావహుల్లో టికెట్ టెన్షన్**

**తాగునీరు, డ్రైనేజీ, రహదారులే ప్రధాన ఎన్నికల అంశాలు.?**

మంగళగిరి(ప్రశ్న న్యూస్) మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంటీఎంసీ) ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ క్రమంగా పెరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సన్నాహాలు ఊపందుకుంటున్న నేపథ్యంలో ఎంటీఎంసీ ఎన్నికలపైనా ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి సారిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వెలువడుతుంది? వార్డుల పునర్విభజన ఎలా ఉంటుంది? రిజర్వేషన్లు ఎవరికి దక్కనున్నాయి? ఏ పార్టీకి ప్రజలు పట్టం కడతారు? అనే అంశాలపై స్థానికంగా జోరుగా చర్చ సాగుతోంది.

మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీలను విలీనం చేసి 2021లో మంగళగిరి--తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ఇరువైపులా ఉన్న పలు గ్రామ పంచాయతీలను కూడా కార్పొరేషన్ పరిధిలోకి తీసుకురావడంతో విస్తారమైన పట్టణ స్థానిక సంస్థగా ఎంటీఎంసీ రూపుదిద్దుకుంది.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం కార్పొరేషన్‌లో 64 వార్డులు ఉన్నాయి. అయితే 2026 ఎన్నికలకు సంబంధించి వార్డుల సంఖ్య, పునర్విభజన, రిజర్వేషన్లపై తుది స్పష్టత అధికారిక ప్రక్రియ పూర్తయిన తర్వాతే రానుంది.

## ఎన్నికల సన్నాహాలపై దృష్టి

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం, మున్సిపల్ అధికారులు సన్నాహాలను పరిశీలిస్తున్నారు. ఇటీవల జరిగిన సమీక్షల్లో ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులు నివేదికలు సమర్పించినట్లు సమాచారం వార్డుల పునర్విభజనకు సంబంధించిన న్యాయపరమైన అంశాలు పరిష్కారమైతే ఎన్నికల ప్రక్రియ మరింత వేగంగా ముందుకు సాగే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఎన్నికల తేదీ, నామినేషన్ల గడువు, వార్డుల రిజర్వేషన్లు తదితర అంశాలపై అధికారిక నోటిఫికేషన్ వెలువడే వరకు ఖచ్చితమైన సమాచారం అందుబాటులో ఉండదు.

## ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకం

ఎంటీఎంసీ ఎన్నికలు అధికార కూటమి, వైఎస్సార్‌సీపీతో పాటు ఇతర రాజకీయ పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారే అవకాశం ఉంది. మంగళగిరి నియోజకవర్గ రాజకీయ పరిణామాల ప్రభావం కూడా కార్పొరేషన్ ఎన్నికలపై పడే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. స్థానిక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఆశావహులు ఇప్పటికే తమ రాజకీయ కార్యకలాపాలను ముమ్మరం చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడితే ప్రధాన పార్టీల్లో రాజకీయ వేడి మరింత పెరిగే అవకాశం ఉంది.

## టికెట్ కోసం అప్పుడే పోటీ

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ప్రధాన పార్టీలకు సవాల్‌గా మారనుంది. ఒక్కో వార్డులో పలువురు ఆశావహులు టికెట్ కోసం పోటీ పడే అవకాశం ఉండటంతో పార్టీల అధిష్ఠానాలు ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. సామాజిక సమీకరణాలు, స్థానిక బలాబలాలు, గత ఎన్నికల ఫలితాలు, ప్రజల్లో వ్యక్తిగత ఆదరణ, పార్టీ పట్ల ఉన్న నిబద్ధత వంటి అంశాలను అభ్యర్థుల ఎంపికలో పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.

## అభివృద్ధే ప్రధాన అజెండా.?

ఎంటీఎంసీ పరిధిలోని స్థానిక సమస్యలు రాబోయే ఎన్నికల్లో కీలక అంశాలుగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్, వీధి దీపాలు, కాలనీల అభివృద్ధి, పార్కులు తదితర సమస్యలు ఎన్నికల ప్రచారంలో ప్రస్తావనకు వచ్చే అవకాశముంది. మంగళగిరి--తాడేపల్లి ప్రాంతానికి 24 గంటల తాగునీటి సరఫరా కోసం రూ.393 కోట్లతో ప్రాజెక్టుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు సమాచారం. అలాగే సుమారు రూ.1,167 కోట్లతో భూగర్భ డ్రైనేజ్ ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ అభివృద్ధి పనులు ఎంతవరకు ముందుకు వచ్చాయి? వాటి అమలు తీరు ఏమిటి? ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలుగుతోంది? అనే అంశాలు కూడా ఎన్నికల సమయంలో రాజకీయ చర్చకు వచ్చే అవకాశం ఉంది.

## నాలుగు గ్రామాలపై ఆసక్తి

ఉండవల్లి, నవులూరు, ఎర్రబాలెం, పెనుమాక గ్రామాలు ప్రస్తుతం మంగళగిరి--తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్నాయి. 2021లో మంగళగిరి--తాడేపల్లి మున్సిపాలిటీల విలీనంతో కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సమయంలో ఈ గ్రామాలు కూడా కార్పొరేషన్‌లో భాగమయ్యాయి. అందువల్ల వీటికి ప్రత్యేకంగా గ్రామపంచాయతీ ఎన్నికలు కాకుండా, ఎంటీఎంసీకి ఎన్నికలు జరిగితే కార్పొరేషన్ ఎన్నికల్లోనే ఈ ప్రాంతాలు భాగస్వాములు కానున్నాయి. అయితే ఈ గ్రామాలు ఏ వార్డుల్లో ఉంటాయి? వాటికి సంబంధించిన రిజర్వేషన్లు ఎలా ఉంటాయి? అనే అంశాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## ఎవరి వైపు ప్రజల మొగ్గు.?

ఎంటీఎంసీ ఎన్నికల్లో మేయర్ పీఠం ఎవరి సొంతమవుతుంది? ఏ పార్టీకి మెజారిటీ దక్కుతుంది? ఏయే ప్రాంతాల్లో రాజకీయ సమీకరణాలు మారనున్నాయి? అనే అంశాలపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది.

అభ్యర్థుల వ్యక్తిగత బలం, స్థానిక సమస్యలపై అవగాహన, పార్టీ బలం, సామాజిక సమీకరణాలు, అభివృద్ధి హామీలు వంటి అంశాలు ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది.

ఎన్నికల అధికారిక నోటిఫికేషన్ వెలువడిన తర్వాతే పోలింగ్ తేదీ, నామినేషన్ల గడువు, వార్డుల రిజర్వేషన్లు, అభ్యర్థుల వివరాలపై పూర్తి స్పష్టత రానుంది. అప్పటివరకు ఎంటీఎంసీ రాజకీయాల్లో ఊహాగానాలు, సమీకరణాలు కొనసాగనున్నాయి.

## ఎన్నికల నగారా ఎప్పుడు?

ఎంటీఎంసీ ఎన్నికలపై అధికారిక ప్రకటన కోసం ప్రజలు, రాజకీయ పార్టీలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. షెడ్యూల్ వెలువడగానే రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కే అవకాశం ఉంది. ప్రస్తుతం మంగళగిరి--తాడేపల్లి రాజకీయాల్లో ఎన్నికల ఉత్కంఠ రోజురోజుకూ పెరుగుతోంది.

# నున్నలో బహిరంగ 'మందు' మోత

- **ఉదయం 5 నుంచి అర్ధరాత్రి 12 వరకు తాగుబోతుల హల్‌చల్**
- **మహిళలు, విద్యార్థులు, వృద్ధులకు తప్పని తిప్పలు.. పోలీసుస్టేషన్ సమీపంలోనే పరిస్థితి!**
- **నిఘా కరువు.. చర్యలు తీసుకోవాలని ఎం సి పి ఐ (యు) వినతి**



**విజయవాడ(ప్రశ్న న్యూస్)** నున్నలోని కొన్ని బహిరంగ ప్రదేశాలు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసుస్టేషన్‌కు సమీపంలోని యూనియన్ బ్యాంకు పరిసరాలు, నివాస ప్రాంతాల మధ్య కొందరు వ్యక్తులు నిత్యం బహిరంగంగా మద్యం సేవిస్తూ హంగామా చేస్తున్నారని ఎంసిపిఐ(యు) నాయకులు ఆరోపించారు. ఉదయం 5 గంటల నుంచే మొదలయ్యే ఈ వ్యవహారం రాత్రి 12 గంటల వరకూ కొనసాగుతోందని పేర్కొన్నారు. మద్యం మత్తులో అసభ్యకరంగా ప్రవర్తించడం, పెద్దపెద్దగా అరవడం, రోడ్లపైనే మూత్ర విసర్జన చేయడం వంటి చర్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

## పట్టపగలే తాగుడా.?

ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాల్లోనే బహిరంగంగా మద్యం సేవిస్తున్నారని నాయకులు ఆరోపించారు. నివాసాల మధ్య ఇలాంటి వ్యవహారం కొనసాగుతుండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మద్యం సేవించిన కొందరు వ్యక్తులు అక్కడే గంటల తరబడి ఉండి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు.

ప్రత్యేకించి ఉదయం వేళల్లో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో, రాత్రి వేళల్లో మహిళలు, వృద్ధులు రాకపోకలు సాగించే సమయంలో ఇలాంటి దృశ్యాలు కనిపించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు.

## మహిళలకు భయం.. విద్యార్థులకు ఇబ్బంది

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ కొందరు వ్యక్తులు చేస్తున్న హంగామాతో మహిళలు ఆ మార్గంలో వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని ఎంసిపిఐ(యు) నాయకులు తెలిపారు. వృద్ధులు సైతం రాత్రి వేళల్లో బయటకు రావాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

విద్యార్థులకు ప్రశాంతమైన చదువుకునే వాతావరణం లేకుండా పోతోందని ఆరోపించారు. నివాస ప్రాంతాల మధ్య మద్యం మత్తులో అరుపులు, అసభ్య పదజాలం వినిపించడం వల్ల చిన్నారులు, విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

## రోడ్లపైనే మూత్ర విసర్జన

బహిరంగ మద్యం సేవనంతో పాటు పరిసరాలను అపరిశుభ్రంగా మార్చుతున్నారని నాయకులు ఆరోపించారు. కొందరు వ్యక్తులు ఇష్టానుసారం బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు.

ప్రజలు నిత్యం ఉపయోగించే ప్రాంతాలను ఇలాంటి చర్యలకు వేదికలుగా మార్చడాన్ని సహించరాదని అన్నారు. పారిశుధ్యం, ప్రజా ఆరోగ్యం, మహిళల భద్రత వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు వెంటనే స్పందించాలని కోరారు.

## పోలీసుస్టేషన్ సమీపంలోనే పరిస్థితి

అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే.. ఈ సమస్య పోలీసుస్టేషన్ పరిసరాల్లోనే ఉందని ఎంసిపిఐ(యు) నాయకులు పేర్కొన్నారు. పోలీసుల నిఘా ఉన్న ప్రాంతాల్లోనే ఇలాంటి కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు రావడం అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు.

అయితే ఆరోపణలపై సంబంధిత పోలీసు అధికారుల అధికారిక వివరణ అందాల్సి ఉంది. ఫిర్యాదులపై పోలీసులు వాస్తవాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.

## రాత్రివేళల్లో గస్తీ పెంచాలి

సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని ఎంసిపిఐ(యు) నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. బహిరంగంగా మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిని గుర్తించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఒక్కసారి తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకోవడం కాకుండా.. సమస్య పరిష్కారమయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ ఉండాలని అన్నారు. అవసరమైతే సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, అందుబాటులో ఉన్న దృశ్యాలను పరిశీలించాలని కోరారు.

## మెమోరాండం అందజేత

సమస్యపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంసిపిఐ(యు) నాయకులు ఆదివారం సాయంత్రం నున్న పోలీసుస్టేషన్‌లో సబ్‌ఇన్‌స్పెక్టర్ మధుశ్రీని కలిసి వివరించారు. బహిరంగ మద్యం సేవనం, అసభ్య ప్రవర్తన, ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, బహిరంగ మూత్ర విసర్జన వంటి సమస్యలను వివరించి మెమోరాండం అందజేశారు.

సమస్యను తీవ్రంగా పరిగణించి సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలు, విద్యార్థులు, వృద్ధులు ఎలాంటి భయాందోళన లేకుండా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ(యు) నాయకులు కాసాని గణేష్‌బాబు, ఎస్.డి. సుభాని, గర్రె శ్రీనివాస్, అంజలి, కంకిపాటి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## 'బహిరంగ తాగుడు'కు చెక్ ఎప్పుడు?

ప్రజా ప్రదేశాల్లో మద్యం సేవించి ఇతరులకు ఇబ్బందులు కలిగించే పరిస్థితులను అరికట్టాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని ఎంసిపిఐ(యు) నాయకులు స్పష్టం చేశారు. నున్నలో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

"ప్రజలు భయపడేలా రోడ్లు, నివాస ప్రాంతాలను కొందరు తమ ఇష్టానుసారం ఉపయోగించుకునే పరిస్థితి ఉండకూడదు. మహిళలు, విద్యార్థులు, వృద్ధులకు భద్రత కల్పించాలి. బహిరంగ మద్యం సేవనాన్ని అరికట్టి నున్నలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలి" అని ఎంసిపిఐ(యు) నగర కార్యదర్శి కాసాని గణేష్‌బాబు కోరారు. నున్నలో బహిరంగ మద్యం సేవనంపై వచ్చిన ఆరోపణలపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతారో వేచి చూడాల్సిందే.

# సమిష్టి కృషితో మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపిద్దాం

**సర్వసభ సమావేశంలో గైరాజరైన అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం**




నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం సమిష్టి కృషితో రాజకీయాలకతీతగా మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తెలిపారు బుధవారం మండల ప్రత్యేక అధికారి రాజు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య. సమావేశంలో. ముఖ్యఅతిథిగా హాజరయ్యారు సమస్యలపై. సర్పంచ్లు అధికారులకు విన్నవించారు ముఖ్యంగా. మండలంలో విద్యుత్ సమస్యలపై. సర్పంచులు. ఆగ్రహం వ్యక్తం చేశారు. కొల్చారంలో. ఎస్సీ కాలనీకి. వెళ్లే మార్గంలో రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేయాలని తెలిపారు రాంపూర్ సర్పంచ్ రాజు మాట్లాడుతూ గ్రామంలో బస్టాండ్ లేక ఇబ్బందులు మరియు ప్రభుత్వ. భూమి పది ఎకరాలు భూమిని ఓ మాజీ ప్రజా ప్రతినిధి కబ్జా చేసిన రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం. లేదని సమావేశంలో తెలిపారు అలాగే తుక్కాపూర్ పైతర కిష్టాపూర్ కొంగోడు వరిగుంతం గ్రామాల సంబంధించిన సర్పంచులు గ్రామంలో ఉన్న సమస్యలపై. అన్ని శాఖ అధికారులకు. విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ. రాజకీయాలకతీతంగా గ్రామాలన్నీ. అభివృద్ధి బాటలో నడిపియాలని అధికారులకు సూచించారు. రైతులకు సంబంధించి యూరియా యాప్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. పేర్కొన్నారు అలాగే మండలంలో నాలుగు. బీటీ రోడ్ల నిర్మాణం కోసం త్వరలో పనులు జరపాలని. సూచించారు రైతుల భూములకు. సంబంధించి పి ఓ టి లో ఉండడం వల్ల రైతులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను పేర్కొన్నారు మండలంలో. ఉన్న రైతులు సంబంధించిన పిఓటి సంబంధించిన. భూముల. వివరాలు జిల్లా కలెక్టర్కు నివేదిక ఇవ్వాలని తాసిల్దార్ శ్రీనివాస్ చారికి సూచించారు. సమావేశానికి గైరాజరన అధికారులపై. చర్యలు తీసుకోవాలని సూచించారు తాసిల్దార్ మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ శిఖం. భూములు కబ్జా చేసేనా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫీక్ హున్నిసా తాసిల్దార్ శ్రీనివాస్ చారి, మండల సర్పంచ్ల పురం అధ్యక్షుడు. రవితేజ రెడ్డి. సర్పంచులు సంగమేశ్వర్ సాదుల స్వప్న. దొడ్ల ఆంజనేయులు శేఖర్ మధుసూదన్ రెడ్డి పాతూరి దయాకర్ గౌడ్ వినోద్ నాయక్, మోహన్ నాయక్, మోహన్, నిర్మల తోపాటు ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) జిల్లాలో ఇటీవల ఎన్నికైన నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మహేష్ బి. గితేని మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నికల నోడల్ అధికారి స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటేశ్వర్లు జిల్లా పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులను జిల్లా ఎస్పీకి పరిచయం చేశారు. అధ్యక్షుడిగా గోపాల్ , ఉపాధ్యక్షులుగా ఇన్స్పెక్టర్ రవి, ఎస్.ఐ వెంకట్రాజం, సెక్రటరీగా ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ గా శ్రీనాథ్ రాజ్ ,ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రకాష్ , ట్రెసరర్ గా వేణు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబెర్స్ గా గోపాల్, శ్రీనివాస్ సుధాకర్, పద్మ,మహేష్ ,తిరుపతి, కో అప్షన్ సభ్యులుగా రిజర్వ్ ఇన్స్పెక్టర్ మధుకర్, మహిళ కానిస్టేబుల్ ప్రియాంక ఉన్నారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులకు ముందుగా అభినందనలు తెలిపారు. పోలీస్ సిబ్బంది సమస్యలపై తక్షణమే స్పందించి, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పోలీస్ అధికారుల సంఘం సిబ్బందికి అండగా నిలుస్తూ, స్ఫూర్తిదాయకంగా పనిచేయాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ వెంకటేశ్వర్లు, నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆకస్మిక దాడులు

**06మందిపై కేసు నమోదు, 9,900/- రూ. 06 మొబైల్ ఫోన్లు**

**అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు**




సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) పట్టణ పరిధిలోని కొత్త బస్టాండ్ సమీపంలోని ఆర్టీసీ కార్ వాషింగ్ సెంటర్ వద్ద నమిలికొండ నర్సయ్య అనే వ్యక్తి ఒక ఇల్లు కిరాయి తీసుకొని అక్రమంగా డబ్బులు పందెంగా పెట్టుకొని పేకాట అడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం రోజు రాత్రి టాస్క్‌ఫోర్స్ ఎస్.ఐ అనిల్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది. పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించగా పేకాట ఆడుతున్న 06 గురు 1.వొల్లాల రమేష్ 2.పెరాల కరుణాకర్ రావు, 3. నమిలికొండ నర్సయ్య, 4.ముత్యాల అఖిల్, 5.మెరుగు లక్ష్మణ్ 6.గుండా సతీష్, అదుపులోనికి తిసుకొని వారి వద్ద 9,000/- రూపాయలు, 06 మొబైల్ ఫోన్లు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకొని సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో అప్పుజెప్పగా కేసు నమోదు చేయడం జరిగిందని టాస్క్‌ఫోర్స్ సి.ఐ నటేష్ తెలిపారు.జిల్లాలో ఎక్కడైనా పేకాట, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, వాటికి స్థావరాలు ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం పోలీస్ వారికి అందించి పోలీస్ వారికి సహకరించాలని తెలిపారు.

## చెరువుల పునర్నిర్మాణ నిర్ణయం చరిత్రాత్మకం

**హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ తో**

**పర్యావరణ సభ్యుల సమీక్షా సమావేశం**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) మోతినగర్ హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఐపీఎస్ పర్యావరణ పరిరక్షణ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచులను నిషేధించి, వాటి స్థానంలో గుడ్డ సంచులను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.సమావేశంలో పలువురు పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు పాల్గొని నగరంలోని జలవనరుల పరిరక్షణ, చెరువుల ఆక్రమణల తొలగింపు, భూగర్భ జలాల పెంపుపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా లయన్ అన్నెం కోటిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెరువుల పునర్నిర్మాణం, పరిరక్షణ కోసం తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు. “భూగర్భ జలాలను కాపాడటం, నగర ప్రజల దాహార్తిని తీర్చడం, చెరువుల కోసం కేటాయించిన భూములను పరిరక్షించడం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం. రాబోయే తరాలకు నీటి భద్రత కల్పించడంలో ఇది మైలురాయిగా నిలుస్తుంది” అని ఆయన అన్నారు.చెరువులు, కుంటలు, వాటి ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్), బఫర్ జోన్ల పరిరక్షణకు హైడ్రా చేపడుతున్న చర్యలకు పర్యావరణ సంస్థలు సంపూర్ణ సహకారం అందించాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో సనత్‌నగర్ ప్రెసిడెంట్ లయన్ డేవిడ్ రాజు, లయన్ తిరుపతి రెడ్డి, లయన్ హనుమంత్ నాయుడు, లయన్ బి. విజయ్ రంగా, శ్రీమతి కల్పన, లక్ష్మి నాయుడు దాస్‌తో పాటు పలువురు పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

## సాయి పేట శ్రీనివాస్ ఏ గువ్వ రవి ల మధ్యలో మాటల యుద్ధం

**గుండ్ల పోచంపల్లి కాంగ్రెస్ సమావేశంలో**

**భగ్గు మన్నా విభేదాలు**

**కార్పొరేట్ టికెట్ కోసం**

**ఇద్దరి మధ్యలో మాటల యుద్ధం**

**డిసిసి అధ్యక్షుడి సమక్షంలోనే వాదనలు**

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ఓబీసీ జిల్లా అధ్యక్షులు గువ్వ రవి, గుండ్ల పోచంపల్లి డివిజన్ మాజీ అధ్యక్షులు సాయి పేట శ్రీనివాస్ మధ్య మాటల యుద్ధం సాగింది. కార్పొరేట్ టికెట్ తనకే ఇవ్వాలి అంటూ గువ్వ రవి డిమాండ్ చేయడంతో సాయి పేట శ్రీనివాస్ మాట్లాడుతూ డివిజన్ అధ్యక్ష పదవి మీకే, కార్పొరేట్ పదవి మీకేనా అంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాంటప్పుడు మేము ఉన్నది ఎందుకు అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు.గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్షులు గరిసెల సురేందర్ ముదిరాజ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, మాజీ డిసిసి అధ్యక్షులు హరి వర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి లతోపాటు మేడ్చల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గువ్వ రవి మాట్లాడుతూ తాను గత కొన్ని ఏళ్ల నుండి ఏ పదవిని ఆశించకుండా పార్టీ జెండాను మోస్తూ వచ్చామని, కానీ తనకు ఏ పదవి రాలేదని తనకు పార్టీ టికెట్ ఇవ్వాలి అంటూ డిమాండ్ చేశారు. అంతేకాకుండా పార్టీలో గ్రూపు రాజకీయాలు ఎక్కువయ్యాయి అంటూ హాట్ కామెంట్స్ చేశారు. అనంతరం గుండ్ల పోచంపల్లి మాజీ అధ్యక్షులు సాయి పేట శ్రీనివాస్ మాట్లాడుతూ అధ్యక్ష పదవి మీకే, కార్పొరేట్ పదవి మీకేనామేమున్నది ఎందుకు అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అలా చేస్తే చూస్తూ ఊరుకోమని మా సత్తా ఏంటో చూపిస్తామంటూ , చూస్తూ ఊరుకోము అంటూ హెచ్చరించారు. ఈ ఇద్దరి నేతల వాదనలు డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, మాజీ డిసిసి అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి సమక్షంలో జరగడం విశేషం.

**సమావేశం ఉద్దేశం ఒకటైతే..**

**ఇక్కడ జరిగింది మరొకటి..**

సమావేశం ఏర్పాటు ఉద్దేశం ఒకటైతే
ఇక్కడ మాత్రం పదవుల కోసం వాదనలు సాగడంపై సీనియర్ నేతల అవాక్కయ్యారు. గుండ్ల పోచంపల్లి డివిజన్ కమిటీలో అనుబంధ సంఘాల పదవుల భర్తీ కోసం సమావేశాన్ని నిర్వహిస్తే ఇక్కడ మాత్రం కార్పొరేట్ పదవి కోసం ఒకరినొకరు వాదించుకోవడం పార్టీ సీనియర్ నేతలు షాక్ కు గురయ్యారు. ఈ వాదనలు వెనక రెండు వర్గాల మధ్యవర్గ పోరు స్పష్టంగా కనిపించింది. ఓబీసీ సెల్ అధ్యక్షులు గువ్వ రవి మాజీ డిసిసి అధ్యక్షులకు హరివర్ధన్ రెడ్డి వర్గానికి చెందిన నేతకాగా, గుండ్ల పోచంపల్లి మాజీ అధ్యక్షులు సాయి పేట శ్రీనివాస్ డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ వర్గం చెందిన నేతగా గుర్తింపు పొందారు. ఇద్దరు నేతల మధ్య ఉన్న వర్గ పోరు ఇక్కడ స్పష్టంగా కనిపించింది. అయితే వారు మాత్రం గంభీరంగా ఉంటూ ఎలాంటి వర్గ పోరు లేదు అంటూ సమావేశాన్ని నిర్వహించారు. లో లోపల మాత్రం తమ పెత్తనం కోసం రెండు వర్గాల మధ్య వర్గ పోరు స్పష్టంగా కనిపించింది. బయటకు మాత్రం మేకపోతు గంభీర్యాన్ని ప్రదర్శిస్తూ సమావేశాన్ని ఎట్టకేలకు ముగించారు.



## చిన్నపాటి వర్షానికే వాగులా మారిన రహదారి

**18వ వార్డులో డ్రైనేజీ దుస్థితి.. ప్రజలకు తప్పని తిప్పలు**

గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో అసంపూర్తి డ్రైనేజీ పనులు మురుగునీటితో రోడ్లపై ఏరులై పారుతున్న వర్షపు నీరు దుర్వాసనతో అవస్థలు.. దోమల బెడదతో అంటువ్యాధుల భయం అధికారులు వెంటనే స్పందించాలంటున్న స్థానికులు రామాలయం వీధి - పాత ఎంపీడీవో కార్యాలయం పరిసరాల్లో దారుణ పరిస్థితి డ్రైనేజీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికుల డిమాండ్ చిన్నపాటి వర్షానికే గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 18వ వార్డులోని రహదారులు వాగులను తలపిస్తున్నాయి. అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులతో వర్షపు నీటితో పాటు మురుగునీరు రోడ్లపైకి చేరి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. రామాలయం వీధి, పాత ఎంపీడీవో కార్యాలయం పరిసరాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. నీరు నిలిచిపోవడంతో దుర్వాసన, దోమల బెడద పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల భయం నెలకొంది. వెంటనే డ్రైనేజీ పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





## ఫోటో ఒక చరిత్ర.. ఒక ఉద్యమం.. ఒక భావోద్వేగం

**ఫోటోగ్రాఫర్ల ఆధ్వర్యంలో**

**రక్తదాన శిబిరం ఏర్పాటు**

**ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవంలో**

**: ఎంపీ రఘునందన్ రావు**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్ పట్టణ కేంద్రంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు హాజరై ఫోటోగ్రాఫర్లకు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఫోటోగ్రాఫర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన అభినందించారు.ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ ఫోటోగ్రఫీ ప్రపంచ చరిత్రను భద్రపరిచే అద్భుతమైన సాధనమని అన్నారు. ఫ్రాన్స్‌కు చెందిన జోసెఫ్ నిసెఫోర్ నీప్స్ 1826-27 ప్రాంతంలో తొలి శాశ్వత ఫోటోగ్రాఫిక్ చిత్రాన్ని రూపొందించారని, అనంతరం లూయీ డాగేర్ అభివృద్ధి చేసిన ప్రక్రియతో ఫోటోగ్రఫీ మరింత విస్తృతంగా ప్రజల్లోకి వచ్చిందని తెలిపారు.“ఒక ఫోటో వేల మాటలతో సమానం. కొన్ని ఫోటోలు ప్రపంచాన్నే కదిలించే శక్తిని కలిగి ఉంటాయి” అని రఘునందన్ రావు అన్నారు. యుద్ధ ప్రాంతాల్లో సంవత్సరాల తరబడి పనిచేసిన ఫోటోగ్రాఫర్లు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అనేక హృదయవిదారక దృశ్యాలను ప్రపంచానికి చూపించారని గుర్తుచేశారు. యుద్ధ సమయంలో చిన్నారి దుస్తులు కాలిపోతూ భయంతో పరుగులు తీస్తున్న దృశ్యాన్ని ఫోటోగ్రాఫర్ కెమెరాలో బంధించిన చిత్రం ప్రపంచ ప్రజల హృదయాలను కదిలించిందని పేర్కొన్నారు.

**తెలంగాణ ఉద్యమంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర కీలకం**

“ఫోటో కేవలం ఒక చిత్రం కాదు.. అది ఒక కాలానికి సాక్ష్యం, ఒక సంఘటనకు ఆధారం, ఒక ఉద్యమానికి చరిత్ర. ఒక మంచి ఫోటో సమాజంలో సృజనాత్మకతను పెంచడంతో పాటు ప్రజల ఆలోచనలను మార్చగలదు” అని ఎంపీ పేర్కొన్నారు.గజ్వేల్ ప్రాంతంలోని ఫోటోగ్రాఫర్లకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని రఘునందన్ రావు హామీ ఇచ్చారు. ఫోటోగ్రాఫర్ల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాదరావు, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, నాలుగో వార్డు కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, మూడో వార్డు కౌన్సిలర్ కాముని మురళి, ఫోటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు బొల్లి బత్తుల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బాకీ శ్రీనివాస్, కోశాధికారి అల్వాల యాదగిరి, సహాయ కార్యదర్శి బండారి మహేందర్, పలువురు సీనియర్ ఫోటోగ్రాఫర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై అన్నప్రసాద సదనం.. మహాప్రసాద భవనం

**రూ.52.50 కోట్లతో నిర్మాణం..**

**21న ప్రారంభోత్సవం**

**ఒకేసారి 800 మంది భక్తులు**

**అన్నప్రసాదం స్వీకరించేలా ఏర్పాట్లు**

**త్వరలో అత్యాధునిక యాంత్రీకృత వంటశాలలు**

విజయవాడ(ప్రశ్న న్యూస్) విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానానికి వచ్చే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా మరో కీలక అడుగు పడింది. భక్తుల సౌకర్యార్థం రూ.52.50 కోట్ల భారీ వ్యయంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనం, శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనం (లడ్డూ పోటు) ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది.ఈ రెండు భవనాలను ఆగస్టు 21న ఉదయం 11.32 గంటలకు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా శాస్త్రోక్తంగా ప్రారంభించి భక్తులకు అంకితం చేయనున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఈవో శీనా నాయక్ తెలిపారు.58 వేల చదరపు అడుగుల్లో అన్నప్రసాద సదనంరూ.26 కోట్ల వ్యయంతో 5,400 చదరపు మీటర్ల (సుమారు 58,125 చదరపు అడుగుల) విస్తీర్ణంలో శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనాన్ని నిర్మించారు. భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో సెంట్రల్ స్టోర్, నిత్యాన్నదానానికి అవసరమైన నిల్వ గదులు, కిచెన్ ప్రిపరేషన్ ఏరియా, క్యూ లైన్లు, వాష్‌రూమ్‌లను ఏర్పాటు చేశారు.
అన్నదానానికి అవసరమైన సరుకుల రవాణా సులభంగా జరిగేలా భవనం మూడు వైపుల నుంచి వాహనాలు రాకపోకలు సాగించే విధంగా మార్గాలను ఏర్పాటు చేశారు.
మొదటి అంతస్తును పూర్తిగా డైనింగ్ హాల్‌గా తీర్చిదిద్దారు. ఒకేసారి 800 మంది భక్తులు కూర్చుని అన్నప్రసాదం స్వీకరించేలా ఆధునిక వసతులు కల్పించారు. 80 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రత్యేక వాష్ ఏరియాను సైతం ఏర్పాటు చేశారు.

**మహాప్రసాద తయారీకి ప్రత్యేక భవనం**

రూ.26.50 కోట్ల వ్యయంతో 3,600 చదరపు మీటర్ల (సుమారు 38,748 చదరపు అడుగుల) విస్తీర్ణంలో శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనాన్ని నిర్మిస్తున్నారు. గ్రౌండ్, మొదటి అంతస్తుల్లో ప్రసాదం విక్రయ కౌంటర్లు, పంపిణీ కేంద్రాలు, భక్తుల క్యూ లైన్లకు ఏర్పాట్లు చేశారు రెండో, మూడో అంతస్తులను పులిహోర, చక్కెరపొంగలి, లడ్డూ తదితర మహాప్రసాదాల తయారీ, ప్యాకింగ్, నిల్వ, నిర్వహణకు అనుగుణంగా ఆధునిక వసతులతో తీర్చిదిద్దుతున్నారు.

**యాంత్రీకృత వంటశాలలు**

భవిష్యత్తులో ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక యాంత్రీకృత వంటశాలలను ఏర్పాటు చేయాలని దేవస్థానం నిర్ణయించింది. పరిశుభ్రత, ఆహార నాణ్యతలో ఏకరూపత, వేగవంతమైన తయారీ లక్ష్యంగా ఈ వంటశాలలను రూపొందించనున్నారు.



**ఏర్పాట్లు పూర్తి**

ఆగస్టు 21న జరగనున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను దేవస్థాన ఇంజనీరింగ్ విభాగం పూర్తి చేసింది. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను బుధవారం నుంచి అందజేస్తున్నట్లు ఈవో శీనా నాయక్ తెలిపారు. భక్తులకు మెరుగైన అన్నప్రసాదం, మహాప్రసాద సేవలను అందించడంతో పాటు ఇంద్రకీలాద్రిపై రద్దీని నియంత్రించేందుకు ఈ రెండు భవనాలు కీలకంగా మారనున్నాయని దేవస్థానం అధికారులు పేర్కొన్నారు.



# బెట్టింగ్ యాప్స్ కేసు

## – ఈడీ ముందుకు హీరోయిన్ నిధి అగర్వాల్

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో టాలీవుడ్ కథానాయిక నిధి అగర్వాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షాక్ ఇచ్చింది. ఈ వ్యవహారానికి సంబంధించి అధికారుల ఎదుట హాజరైన ఆమెను ఈడీ బృందం సుమారు నాలుగు గంటల పాటు ప్రశ్నించింది.

ప్రధానంగా 'జీత్ విన్' లాంటి గేమింగ్ యాప్‌ల ప్రచారంలో ఆమె భాగస్వామ్యంపై అధికారులు లోతుగా దర్యాప్తు చేశారు. ఈ ఒప్పందాలకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లను పరిశీలించిన అధికారులు... ప్రమోషన్స్ కోసం ఆమె అందుకున్న భారీ పారితోషికం వివరాలు, ఆ నగదు హవాలా మార్గంలో వచ్చిందా లేక బ్యాంకింగ్ లావాదేవీల ద్వారా చెల్లించారా అనే అంశాలపై సుదీర్ఘంగా ప్రశ్నించినట్లు సమాచారం. దేశంలో వేల కోట్ల రూపాయల మనీ లాండరింగ్‌కు పాల్పడుతూ, అక్రమంగా విదేశాలకు నిధులు తరలిస్తున్న బెట్టింగ్ నెట్‌వర్క్‌లపై ఈడీ ఉక్కుపాదం మోపుతోంది.

ఇందులో భాగంగానే ఈ యాప్‌లకు ప్రచారకర్తలుగా వ్యవహరించిన సినీ సెలబ్రిటీలు, సోషల్ మీడియా స్టార్లపై ప్రత్యేక దృష్టి పెట్టి వరుసగా నోటీసులు ఇస్తూ విచారిస్తోంది. విచారణ పూర్తయిన తర్వాత ఈడీ ఆఫీస్ నుంచి బయటకు వచ్చిన నిధి అగర్వాల్‌ను మీడియా ప్రతినిధులు చుట్టుముట్టినప్పటికీ, ఆమె ఏ ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా మౌనంగా తన కారులో వెళ్లిపోయారు.



# 'మిస్టర్ మిడిల్ క్లాస్' మూవీ రివ్యూ!

కామెడీ ప్రధానమైన కథలను తెరకెక్కించడంలో దర్శకుడు జి.నాగేశ్వరరెడ్డికి మంచి నైపుణ్యం ఉంది. 'సీమశాస్త్రి'.. 'సీమటపాకాయ్' .. 'దేనికైనా రెడీ' సినిమాలు ఆయన మార్క్ ఏమిటనేవి చూపిస్తాయి. అలాంటి ఆయన శ్రీకాంత్ కథానాయకుడిగా రూపొందించిన సినిమానే 'మిస్టర్ మిడిల్ క్లాస్'. శ్రీకాంత్ సరసన లయ నటించగా, ఇతర కీలకమైన పాత్రలలో రాజేంద్రప్రసాద్ .. వెన్నెల కిశోర్ .. రఘుబాబు .. పృథ్వీ కనిపించనున్నారు. జులై 17వ తేదీన థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, ఈ రోజు ( ఆగస్టు 19) నుంచి 'ఆహా'లో స్ట్రీమింగ్ అవుతోంది. వెంకటరమణ (శ్రీకాంత్) పద్మావతి (లయ) భార్యాభర్తలు. వారికి ఇద్దరు పిల్లలు. వెంకటరమణ తండ్రి ఏడు కొండలు (మురళీధర్ గౌడ్) అతని చెల్లెలు కరుణ – బావ శ్రీను కూడా అదే ఇంట్లో ఉంటారు. మిడిల్ క్లాస్ ఫ్యామిలీకి చెందిన వెంకటరమణకు, ఆర్థికపరమైన ఇబ్బందులు ఎంతమాత్రం లేని కోటీశ్వరుడు కావాలనేది కోరిక. ఆ దురాశ కారణంగానే అతను పెద్ద హోటల్ పెట్టి అప్పులపాలవుతాడు. అదే హోటల్లో ఆ ఫ్యామిలీ అంతా పనివాళ్లుగా చేరే పరిస్థితి వస్తుంది. అలా వచ్చిన డబ్బుతోనే అప్పులు తీరుస్తూ వెళుతుంటారు. ఒకానొక దశలో అతను తాను బలంగా నమ్మే వేంకటేశ్వరస్వామి గుడి దగ్గరే నైట్ వాచ్ మెన్ గా కుదురుతాడు. భార్య ఆయాగా చేరవలసిన పరిస్థితి వస్తుంది. ఆ దేవుడు ఆర్థికపరమైన ఇబ్బందుల నుంచి తనని బయటపడేయక పోవడం వలన, ఆత్మహత్య చేసుకోవాలని వెంకటరమణ నిర్ణయించుకుంటాడు. అప్పుడు ఆ స్వామి (రాజేంద్రప్రసాద్) ప్రత్యక్షమై, తన విలువైన ఆభరణాలను అతనికి ఇస్తాడు. అయితే అవి గిల్ట్ నగలు అనుకుని, పద్మావతి వాటిని చెరువులో పారేస్తుంది. ఈ విషయం తెలుసుకున్న స్వామి, వెంకటరమణకు 13 పేజీలను కలిగిన ఒక 'బుక్' ఇస్తాడు. ఆ బుక్ లో అతను ఏది రాస్తే అది జరుగుతుందని చెబుతాడు. కొన్ని నియమాలు చెప్పి వాటి ప్రకారమే చేయాలని అంటాడు. బుక్ క్రింద పడిపోతే తన శక్తిని కోల్పోతుందని చెబుతాడు. ఆ తరువాత వెంకటరమణకి ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? అందుకు తగినట్టుగా ఆ బుక్ లో అతను ఏమేం రాస్తూ వెళతాడు? అందువలన అతని జీవితంలో ఎలాంటి మార్పులు సంభవిస్తాయి? అనేదే కథ. శ్రీమంతుల ఆలోచనలు రకరకాలుగా ఉంటాయేమోగానీ, మిడిల్ క్లాస్ కుటుంబానికి చెందిన వాళ్లందరి ఆలోచనలు దాదాపు ఒకే రకంగా ఉంటాయని అంటారు. ఉమ్మడి కుటుంబం .. అవసరాలు .. అప్పుల మధ్యలో వాళ్లు సతమతమైపోతుంటారు. ఆ ఇబ్బందుల నుంచి బయటపడటం కోసం, సాధ్యమైనంత తొందరగా డబ్బు సంపాదించాలని ఆరాటపడతారు. అలా ఆశపడే వెంకటరమణ అనే పాత్ర చుట్టూ రాసుకున్న కథ ఇది. మిడిల్ క్లాస్ కుటుంబాలకు చెందినవారు జీవితం పట్ల భయము – భద్రత రెండూ కనబరుస్తూ ఉంటారు. తమకి సహకరించమని దేవుడి పాదాలను ఆశ్రయిస్తుంటారు. అలాంటి పరిస్థితులలో దేవుడే దిగి వచ్చి వాళ్లకు వరాలను ఇస్తే, వాళ్ల తలరాతను మార్చుకునే అవకాశం వారికే ఇస్తే ఎలా ఉంటుంది? అనే ఒక ఆలోచన నుంచి ఈ కథ పుట్టిందని చెప్పుకోవచ్చు. ఆర్థికపరమైన ఇబ్బందులతో ఉక్కిరిబిక్కిరయ్యే ఒక మధ్యతరగతి మానవుడికి, దేవుడే ప్రత్యక్షమై వరాలనిస్తే, అతను సద్వినియోగం చేసుకున్నాడా? దుర్వినియోగం చేసుకున్నాడా? అనే అంశం చుట్టూ ఈ కథ తిరుగుతూ వెళుతుంది. ఈ నేపథ్యంలో ప్రతి పాత్రను దర్శకుడు డిజైన్ చేస్తూ వెళ్లిన విధానం ఆడియన్స్ కి అవసరమైన వినోదాన్ని పంచుతుంది.మానవుడి కోరిక .. దేవుడి వరం అనే రెండు ప్రధానమైన అంశాలను టచ్ చేస్తూ సాగే ఈ కథ, బోర్ అనిపించకుండా సరదాగా సాగిపోతూ ఉంటుంది. తాము బాగుపడాలనే కోరికతో పాటు, ఇతరులు చెడిపోవాలనే మానవుల సహజమైన అసూయ ద్వేషాలను కూడా దర్శకుడు ఆవిష్కరించిన విధానం మెప్పిస్తుంది. ముఖ్యంగా దేవుడిచ్చిన బుక్ కోసం కొంతమంది స్వార్థపరులు ప్రయత్నించడం .. ఆ బుక్ చేతులు మారుతూ వెళ్లడం సరదాగా నవ్విస్తుంది. అలాగే స్వామివారే స్వయంగా ఆభరణాలు ఒలిచి ఇచ్చారని చెబితే కుటుంబ సభ్యులు నమ్మకపోవడం కూడా సరదాగా అనిపిస్తుంది.ఫస్టాఫ్ లో స్వామివారి ఆభరణాలకు సంబంధించిన సన్నివేశాలు, సెకండాఫ్ లో స్వామివారు ఇచ్చిన 'బుక్' కి సంబంధించిన సన్నివేశాలు ఆడియన్స్ కి కనెక్ట్ అవుతాయి. నాగేశ్వరరెడ్డి కామెడీపై తనకి గల పట్టును మరోసారి నిరూపించాడు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఫరవాలేదు. గ్రాఫిక్స్ కి సంబంధించిన వర్క్ బాగుంది. శ్రీకాంత్ .. లయ .. రాజేంద్రప్రసాద్ నటన చాలా సహజంగా అనిపిస్తుంది. సునీల్ .. వెన్నెల కిశోర్ .. రఘుబాబు .. పృథ్వీ కామెడీ కూడా సందడి చేస్తుంది. దణ్ణం పెట్టుకోగానే దేవుడు ప్రత్యక్షమైతే .. కోరగానే కోరికలు తీర్చుకునే అవకాశం ఇస్తే బాగుంటుందని చాలామంది అనుకుంటారు. అలానే జరిగితే ఆ మనిషి ఎలాంటి ఇబ్బందులలో పడతాడో చూపించే కంటెంట్ ఇది. ఎవరికి ఏది ఇవ్వాలో .. ఎప్పుడు ఇవ్వాలో దైవానికి తెలుసు. ఆశపడిపోయి ..

# ఓటీటీకి విజయ్ భారీ యాక్షన్ మూవీ



## 'జననాయగన్'

విజయ్ కి తమిళనాట ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు. విజయ్ అధికారంలోకి వచ్చిన తరువాత, ఆయన మొదటి సినిమాగా రూపొందిన 'జన నాయగన్' సినిమాపై విడుదలకి ముందే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమా సంచలన విజయాన్ని సాధించడం ఖాయమనీ, రికార్డుస్థాయి వసూళ్లను రాబడుతుందనడంలో సందేహం లేదని చెప్పుకున్నారు. విడుదల తరువాత ఈ సినిమా అభిమానుల అంచనాలను అందుకోవడానికి తనవంతు ప్రయత్నం చేస్తూ వెళ్లింది. 300 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమాకి, వినోత్ దర్శకత్వం వహించాడు. అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, జులై 23వ తేదీన థియేటర్లకు వచ్చింది. పూజ హెగ్డే – మమితా బైజు కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఇప్పుడు ఓటీటీకి రావడానికి సిద్ధమవుతోంది. ఈ సినిమా ఓటీటీ హక్కులను జీ 5వారు దక్కించుకున్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఈ సినిమాను తమిళంతో పాటు, తెలుగు .. మలయాళ.. కన్నడ .. హిందీ భాషల్లోను అందుబాటులోకి తీసుకురానున్నట్టుగా ప్రకటించారు. 'వెట్రి' కొన్ని కారణాల వలన జైలు జీవితాన్ని అనుభవిస్తాడు. క్షమా భిక్ష కారణంగా బయటికి వస్తాడు. జైలులో ఉన్నప్పుడు అక్కడి అధికారితో అతనికి పరిచయమవుతుంది. ఆ అధికారి హఠాత్తుగా చనిపోవడంతో, ఆయన కూతురు 'విజ్జి' ఒంటరి అవుతుంది. దాంతో వెట్రి ఆమెను చేరదీస్తాడు. అయితే ఆమెను అంతం చేయడానికి 'హిమ్లర్' తన గ్యాంగ్ ను రంగంలోకి దింపుతాడు. హిమ్లర్ ఎవరు? ఆయన విజ్జీని ఎందుకు చంపాలని అనుకుంటున్నాడు? ఆయన బారి నుంచి విజ్జీని కాపాడటం కోసం వెట్రి ఏం చేస్తాడు? అనేది కథ. ఓటీటీ వైపు నుంచి ఈ సినిమా ఏ స్థాయి రెస్పాన్స్ ను రాబడుతుందనేది చూడాలి మరి.

# అత్యంత అందమైన దానివి నువ్వే..।

## త్రిషపై కామెంట్ సోషల్ మీడియాలో వైరల్

మొన్న తమిళనాడులో జరిగిన స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో త్రిష ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె లుక్ సోషల్ మీడియాలో కూడా ఓ రేంజ్‌లో వైరల్ అయింది. తాజాగా ఆ వేడుకకు చెందిన మరిన్ని ఫొటోలను తన ఇన్‌స్టా ద్వారా షేర్ చేశారు త్రిష. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట సందడి చేస్తున్నాయి. పసుపురంగు చీరలో హుందాగా కనిపిస్తున్న త్రిషపై అభిమానులు ప్రశంసలసు కురిపిస్తున్నారు. నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బు సైతం త్రిషను అభినందిస్తూ కామెంట్ పెట్టారు.ప్రస్తుతం ఈ కామెంట్ సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. 'నిన్ను ప్రేమించకుండా ఉండేందుకు నాకు ఒక్క కారణం చెప్పు. లోపల.. బయట అత్యంత అందమైన దానివి నువ్వే..' అంటూ త్రిషను ఖుష్బు ప్రశంసించారు. త్రిష అందమే కాక, వ్యక్తిత్వాన్ని కూడా మెచ్చుకుంటూ ఆమె చేసిన కామెంట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



# 'సిగ్మా' విడుదల అప్పుడే

సందీప్ కిషన్ కథానాయకుడిగా రూపొందుతున్న యాక్షన్ అడ్వెంచర్ 'సిగ్మా'. జాసన్ సంజయ్ దర్శకుడు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్నది. అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మంగళవారం మేకర్స్ ఓ ప్రకటన విడుదల చేశారు. గాంధీ జయంతి హాలిడేతో పాటు వీకెండ్ కూడా కలిసి రావడంతో ఈ డేట్ సినిమాకు మంచి అడ్వాంటేజ్ కానున్నదని మేకర్స్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో హీరో సందీప్ కిషన్ ఇంటెన్స్ అవతారంలో కనిపిస్తున్నారు. కిటికీ నుంచి సూర్య కిరణాలు తనని తాకుతుండగా, ఆ వెలుతురులో కనిపిస్తున్న అతని లుక్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నది. ఆయన పక్కనే ఓ కుక్క కూడా ఉండటం గమనార్హం. ఫరియా అబ్దుల్లా, రాజు సుందరం, సంపత్‌రాజ్, శివ పండిట్, అన్బు థాసన్, యోగ్ జపే తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: క్రిషన్ వసంత్, సంగీతం: ఎస్.థమన్.



# పనసపల్లి ఫ్యాన్స్ అసోసియేషన్



వివేక్ దండు హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'పనసపల్లి ఫ్యాన్స్ అసోసియేషన్'. గ్రామీణ నేపథ్యంలో పీరియాడిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నారు. సి. హెచ్. రవికిషోర్ దర్శకుడు. సంగీర్తన విపిన్ కథానాయికగా నటిస్తున్నది. ఇటీవలే ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. పనసపల్లి అంటే సినీ ప్రియులకు కేంద్రం.దకొత్త సినిమా విడుదలైందంటే ఊర్లో గోడలపై పోస్టర్స్ పడాల్సిందే. హీరో పనసపల్లి మెగా కామ్రేడ్స్ ఫ్యాన్స్ అధ్యక్షుడు. మరోవైపు కథానాయిక బాలకృష్ణ అభిమాన సంఘం ప్రెసిడెంట్. వీరిద్దరు రికార్డులపై పోటాపోటీలు పడటం మోషన్ పోస్టర్‌లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఆద్యంతం చక్కటి వినోదంతో సాగే చిత్రమిదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎల్.రాజా, రచన–దర్శకత్వం: సి. హెచ్. రవికిషోర్.

## బషారత్ ఉన్నిసా బేగం మృతి..
# ప్రముఖుల సంతాపం



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యూజె) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఖాజా విరాహత్ అలీ, బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర నాయకులు ఖాజా విరాసత్ అలీ, ఖాజా విజారత్ అలీ, (హైకోర్టు న్యాయవాది) మాతృమూర్తి బషారత్ ఉన్నిసా బేగం అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి, బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు, బషారత్ ఉన్నిసా బేగం పార్థివదేహానికి నివాళు లర్పించారు. అనంతరం ఖాజా విరాహత్ అలీ, ఖాజా విరాసత్ అలీ, ఖాజా విజారత్ అలీలను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# రిజిస్ట్రేషన్లలో ప్రజలకు ఇబ్బందులు కలగొద్దు

- కలెక్టర్ మను చౌదరి
- 22ఎ పెండింగ్ దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలని ఆదేశం
- సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయాలకు వచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, లావాదేవీలు వేగంగా మరియు సులభంగా పూర్తయ్యేలా చూడాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. అప్‌డేట్ చేసిన జాబితా ప్రకారం సెక్షన్ 22ఎ నిషేధిత భూముల పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. బుధవారం మేడ్చల్ మండలంలోని సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా 22ఎ లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల క్లియరెన్స్ ప్రక్రియను, సర్వే నంబర్ల వారీగా రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రజలు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకునే సమయానికే వారికి 22ఎ క్లియరెన్స్ ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మేడ్చల్, దుండిగల్ తహసీల్దార్ల వద్ద ఉన్న జాబితాను రిజిస్ట్రేషన్ కార్యాలయ రికార్డులతో సరిచూసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) కేసుల్లో లింక్ డాక్యుమెంట్లను పరిశీలించి, ప్రత్యేక శ్రద్ధతో పెండింగ్ దరఖాస్తులను వెంటనే జాబితా నుంచి తొలగించాలని స్పష్టం చేశారు. స్లాట్ బుక్ అయిన తర్వాత పెండింగ్‌లో ఉన్న డాక్యుమెంట్లను త్వరగా పరిష్కరించేలా సబ్-రిజిస్ట్రార్, రెవెన్యూ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ అశోక్, మేడ్చల్ తహసీల్దార్ వీరనాల భూపాల్, దుండిగల్ తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డిలతో పాటు పలువురు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ దృష్టికి రోడ్ల దుస్థితి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ 297 డివిజన్ పరిధిలోని రోడ్ల దుస్థితిని మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నేత రామన్న గారి మణికంఠ గౌడ్ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. మేడ్చల్ డివిజన్ పరిధిలో నెలకొన్న రోడ్ల దుస్థితిని మణికంఠ గౌడ్ జోనల్ కమిషనర్ ను తీసుకెళ్లి చూపించారు. రోడ్లు పూర్తిగా ధ్వంసమై ప్రమాదకరంగా తయారయ్యాయని, వెంటనే సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని మాజీ కౌన్సిలర్ మణికంఠ గౌడ్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ను కోరారు. ఈ సందర్భంగా మేడ్చల్ 297 డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో స్వయంగా తీసుకెళ్లి రోడ్ల దుస్థితిని చూపించారు. చినుకు పడితే చాలు రోడ్లు అన్నీ గుంతల మయంగా మారాయని, దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, తక్షణమే స్పందించి రోడ్ల మరమ్మత్తులు చేయడంతో రోడ్లు లేని ప్రాంతాలలో సిసి రోడ్లను ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్ ను రామన్న గారి మణికంఠ గౌడ్ కోరారు. ఇదేవిధంగా మేడ్చల్ పెద్ద చెరువుకు చెందిన కట్టప్ప పై ఉన్న రోడ్డును మరమ్మత్తులు చేయాలని కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఎప్పుడు రద్దీగా ఉండే చెక్ పోస్ట్ రోడ్డును మరమ్మత్తులు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ మాట్లాడుతూ మేడ్చల్ డివిజన్ పరిధిలో నెలకొన్న రోడ్ల దుస్థితిని స్వయంగా చూశానని, రోడ్ల మరమ్మత్తులతో పాటు సిసి రోడ్లను. వేయిస్తామని హామీ ఇచ్చారు. కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ వెంట మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుదాంష్ తదితరులు ఉన్నారు.

# 'సాయిల్ టు సోల్' - సహజ ఆహారం

- వ్యవసాయం & ఆరోగ్యకర జీవనంపై ప్రత్యేక ఉపన్యాసం
- మారేడ్‌పల్లిలోని కస్తూర్బా గాంధీ మహిళా కళాశాలలో ప్రత్యేక అవగాహనా కార్యక్రమం







హైదరాబాద్(ప్రశ్న న్యూస్) మారేడ్‌పల్లిలోని కస్తూర్బా గాంధీ మహిళా కళాశాలలో నిన్న ఉదయం 10:30 గంటలకు హాస్టల్ ఆడిటోరియంలో స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్ మరియు ఐక్యూఏసీ ఆధ్వర్యంలో 'సాయిల్ టు సోల్' పేరుతో "సహజ ఆహారం, వ్యవసాయం & ఆరోగ్యకర జీవనం" అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించబడింది. జ్యోతి ప్రజ్వలనంతో ప్రారంభమైన ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీ, స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ లలితా దేవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శ్రీమతి సునందతో పాటు దాదాపు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

### కార్యక్రమం ముఖ్య ఉద్దేశం..

సహజ ఆహారం, సుస్థిర వ్యవసాయం, ఔషధ మొక్కలు, ఆరోగ్యకర జీవన విధానాలు మరియు సమగ్ర ఆరోగ్య విధానాన్ని అవలంబించడం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ లక్ష్యం. మన చుట్టూ ఉన్న సాంప్రదాయిక మరియు సహజ వనరులు, వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, పోషకమైన మరియు సహజంగా ఉత్పత్తి చేసిన ఆహారాన్ని తీసుకోవడం యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేయడం ఈ కార్యక్రమ ఉద్దేశం. అంతేకాకుండా ఆరోగ్యకరమైన ఆహారం, వ్యక్తిగత శ్రేయస్సు, పర్యావరణ సుస్థిరత మరియు బాధ్యతాయుతమైన వ్యవసాయ పద్ధతుల మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవడానికి పాల్గొనేవారిని ప్రోత్సహించడం కూడా దీని లక్ష్యం.

### సహజ వ్యవసాయం, సేంద్రియ ఆహారం, ఔషధ మొక్కలపై విజయ రామ్ ప్రసంగం..

విజయ రామ్, సేవ్ (సొసైటీ ఫర్ అవేర్‌నెస్ అండ్ విజన్ ఆన్ ఎన్విరాన్‌మెంట్) వ్యవస్థాపకులు మరియు ఎమరాల్డ్ స్వీట్స్ సంస్థతో అనుబంధం కలిగిన ఆయన, సహజ వ్యవసాయం, సేంద్రియ ఆహారం, ఔషధ మొక్కలు మరియు మానవ ఆరోగ్యంలో వాటి ప్రాముఖ్యత గురించి విస్తృతంగా మాట్లాడారు. జుట్టు రాలడం, చుండ్రు వంటి సాధారణ సమస్యలకు సాంప్రదాయకంగా ఉపయోగించే వివిధ ఆకులు మరియు మొక్కల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే కొన్ని తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు సంబంధించి కొన్ని మొక్కల సాంప్రదాయిక ప్రాముఖ్యత గురించి కూడా చర్చించారు. మనం ఏమి తింటున్నామో, మనం తినే ఆహారం నిజంగా సహజమైనదా, సేంద్రియమైనదా అని అర్థం చేసుకోవడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఆవు ఆధారిత సహజ వ్యవసాయ పద్ధతుల ప్రాముఖ్యతను మరియు వ్యవసాయంలో ఆవు పేడ యొక్క సాంప్రదాయిక ఉపయోగాన్ని కూడా ఆయన హైలైట్ చేశారు.

### పోషకాహారం, ఆరోగ్యకర జీవనంపై సురేందర్ ప్రసంగం..

సురేందర్ పోషకాహారం, ఆరోగ్యకర జీవనం గురించి సమాచారాత్మక సెషన్ అందించారు. సరైన పోషకాహారం తీసుకోవడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. శాఖాహార ఆహారాలు కూడా తగినంత ప్రోటీన్ అందిస్తాయని తెలిపారు. ఆవు గడ్డి తిని ప్రోటీన్ అధికంగా ఉండే పాలు ఇవ్వడాన్ని ఉదాహరణగా చూపిస్తూ, ప్రోటీన్ కోసం చికెన్ వంటి మాంసాహారం మాత్రమే అవసరమనే నమ్మకం ఒక అపోహ అని వివరించారు. నువ్వుల నూనె, కొబ్బరి నూనె వంటి సాంప్రదాయిక నూనెల ప్రయోజనాల గురించి కూడా మాట్లాడారు. కొన్ని వాణిజ్యపరంగా లభించే షాంపూలు మరియు వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు ఎలా తయారు చేస్తారో వివరించడంతో పాటు, సహజ షాంపూలు మరియు ప్రత్యామ్నాయాల గురించి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన మరియు సమాచారంతో కూడిన ఎంపికలు చేసుకోవడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.

### ఔషధ మొక్కలు, తులసి ప్రాముఖ్యతపై మాజీ అటవీ అధికారి ఎం.డి. రఫీయుద్దీన్..

ఎం.డి. రఫీయుద్దీన్, ఫారెస్ట్ అధికారిగా పని చేసి రిటైరైన ఆయన, మొక్కల గురించి మరియు వాటి సాంప్రదాయిక ఉపయోగాల గురించి విలువైన జ్ఞానాన్ని పంచుకున్నారు. ప్రత్యేకంగా తులసి మొక్కపై ప్రత్యేక దృష్టి పెట్టారు. సాధారణంగా లభించే మొక్కల ప్రాముఖ్యతను, సాంప్రదాయిక ఆరోగ్య పద్ధతులు, పర్యావరణ అవగాహనలో వాటి పాత్రను అభినందించడానికి ఆయన ప్రసంగం పాల్గొనేవారికి సహాయపడింది.

### వివిధ ఔషధ మొక్కలపై సింహాచలం లక్ష్మణ స్వామి అవగాహన..

ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సింహాచలం లక్ష్మణ స్వామి వివిధ మొక్కలు మరియు ఔషధ మొక్కలపై సమాచారాత్మక సెషన్ అందించారు. మన చుట్టూ ఉన్న ఉపయోగకరమైన మొక్కల వైవిధ్యాన్ని మరియు వాటి ఉపయోగాల గురించి సాంప్రదాయిక జ్ఞానాన్ని కాపాడుకోవడం యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడానికి ఆయన వివరణ సహాయపడింది.

### సహజ ఆహారం నుంచి ఆరోగ్యకర జీవనం వరకు..

మొత్తంగా ఈ కార్యక్రమం సహజ ఆహారం, సేంద్రియ మరియు సుస్థిర వ్యవసాయం, ఔషధ మొక్కలు, సాంప్రదాయిక జ్ఞానం, పోషకాహారం మరియు ఆరోగ్యకర జీవనం గురించి విలువైన అంతర్దృష్టులను అందించింది.
మనం తీసుకునే ఆహారం, ఉపయోగించే ఉత్పత్తులు మరియు మన చుట్టూ ఉన్న సహజ వనరుల గురించి మరింత అవగాహనతో ఉండేలా సెషన్లు పాల్గొనేవారిని ప్రోత్సహించాయి. సుస్థిర, ఆరోగ్యకర జీవనం అనే విస్తృత భావనతో సాంప్రదాయిక జ్ఞానాన్ని ఈ కార్యక్రమం విజయవంతంగా అనుసంధానించింది.

### విద్యార్థుల నుంచి విశేష స్పందన..

కార్యక్రమం చాలా సమాచారాత్మకంగా మరియు ఆసక్తికరంగా ఉందని విద్యార్థులు తెలిపారు. ఔషధ మొక్కలు, సహజ ఆహారం, సేంద్రియ వ్యవసాయం, పోషకాహారం మరియు ఆరోగ్యకర జీవనం గురించి వక్తలు పంచుకున్న విలువైన జ్ఞానాన్ని వారు అభినందించారు. సెషన్లలో పంచుకున్న ఆచరణాత్మక సమాచారం వారి దైనందిన జీవితాల్లో సహజమైన మరియు ఆరోగ్యకరమైన ఎంపికల ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడానికి సహాయపడిందని కూడా వారు పేర్కొన్నారు.

## సంక్షేమ పథకాలను రద్దు చేసే ప్రసక్తే లేదు

- సాయిపేట శ్రీనివాస్
- రాజకీయ లబ్ధి కోసమే ధర్నాలు, అవసరమైతే హైకోర్టులో అప్పీల్ చేసి లబ్ధిదారులకు న్యాయం చేస్తాం
- గ్రీన్ ఛానల్ ద్వారా నిధుల విడుదల, బీఆర్ఎస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారని స్పష్టీకరణ



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి ప్రజా సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తోందంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని గుండ్లపోచంపల్లి 299 డివిజన్ మాజీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ స్పష్టం చేశారు. పేద ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే పథకాలను రద్దు చేసే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపు మేరకు ఆయన గుండ్లపోచంపల్లిలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సరైన చట్టబద్ధత లేకుండా, లోపభూయిష్టంగా జారీ చేసిన ఉత్తర్వుల కారణంగానే ప్రస్తుతం హైకోర్టులో న్యాయపరమైన వివాదం ఏర్పడి నిధుల పంపిణీకి తాత్కాలిక ఆటంకం కలిగిందని ఆయన వివరించారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిధులను గ్రీన్ ఛానల్ ద్వారా విడుదల చేస్తున్నామని, ప్రస్తుత సమస్య పరిష్కారానికి అవసరమైతే హైకోర్టులో అప్పీల్ చేసి పథకాల నిరంతర అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బండారి నరేందర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుంద భానుచందర్, లేబర్ సెల్ అధ్యక్షుడు కావాలి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు వడ్డే ప్రవీణ్, షబ్బీర్, సోను, మల్లేష్, ఉదయ్, సంపత్, అనిల్, కిషన్, నందు, సురేష్ రెడ్డి, అఖిల్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నప్రసాద పాధకానికి లక్ష విరళం

### ధాతకు బాండ్ అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకురాలు



శ్రీశైలం ( ప్రశ్నన్యూస్) దేవస్థానం అన్నదానం పథకానికి కె. వి. వరప్రసాద్,ప్లానెట్ ఫ్యాక్టరీ, ఈస్ట్ గోదావరి వారు అన్నప్రసాద వితరణ కు పథకానికి విరాళంగా రూ. 1,01,000 /-లను అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకురాలు,టి.హిమబిందుకు అందజేశారు. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు.

## పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

### డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) పార్టీ పటిష్టనికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. గుండ్ల పోచంపల్లి లోని ఓ ఫంక్షన్ హాల్ లో గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గరిసెల సురేందర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ కార్యకర్త ల సమావేశంలో డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అనుబంధ సంఘాల పదవుల భర్తీ కోసం ఆసక్తిగల అభ్యర్థుల పేర్లను సేకరిస్తున్నామని తెలిపారు. అనుబంధ సంఘాల పదవుల పై ఆసక్తి ఉన్నవారు ఇవ్వాలని కోరారు. పదవులను పొందిన వారు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో 3 డివిజన్లను కైవసం చేసుకునేలా అనుబంధ సంఘాల పదవులు పొందిన వారు కృషి చేయాలని సూచించారు. కష్టపడే వారికి పార్టీలో ఎప్పుడు గుర్తింపు ఉంటుందని దానిని గుర్తుంచుకొని పార్టీ అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. ఎన్నికలలో అభ్యర్థులకు టికెట్లు ఇచ్చే బాధ్యత పార్టీ అధిష్టానమే చూసుకుంటుంది తప్ప మా చేతిలో ఏమీ లేదని ఈ విషయాన్ని ఆశావాహులు గుర్తుంచుకొని పార్టీ అభివృద్ధి కోసం పాటుపడాలని సూచించారు. పార్టీలో కష్టపడే వారికి మాత్రమే ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ టిక్కెట్లు లభిస్తుందని , అంత పార్టీ అధిష్టానం చూసుకుంటుందని పేర్కొన్నారు.

### కలిసికట్టుగా పనిచేయాలి

పార్టీ కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే ఆశించిన ఫలితాలు వస్తాయని మాజీ డిసిసి అధ్యక్షులు హరి వర్ధన్ రెడ్డి అన్నారు. గుండ్ల పోచంపల్లి లో జరిగిన సమావేశంలో హరి వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ సంక్షేమం కోసం కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అనుబంధ సంఘాల పదవుల కోసం ఆశిస్తున్న అభ్యర్థులుతమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఎంపికైన అభ్యర్థులు పార్టీ సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. రాజకీయంలో పదవులు శాశ్వతం కావని కొన్ని రోజులు మంచి పదవిలో ఉంటాము మరికొన్ని రోజులు పదవులు లేకున్నా ఉండాల్సిన పరిస్థితులు వస్తాయని, ఇలాంటి సమయంలో కార్యకర్తలు మనోధైర్యంతో ఉంటూ పార్టీ సంక్షేమం కోసం పాటుపడాలన్నారు. ప్రతి ఒక్కరు నవ్వుతూ పార్టీ అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ కాంగ్రెస్ సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో అన్నప్రసాదం..

# భక్తుల ఆకలి తీర్చేదెవరు.?

- అభివృద్ధి ఘనంగా.. అన్నప్రసాదం మాత్రం పరిమితంగా
- 1500 మందికే అనుమతి.. 1800 మందికి పైనే వస్తున్న భక్తులు
- సాయంత్రం 5 గంటల వరకు అన్న ప్రసాదం కొనసాగించాలని భక్తుల డిమాండ్
- భక్తులకు పూర్తిస్థాయిలో అందని అన్న ప్రసాదం చాలామంది తిరిగి వెళుతున్న వైనం
- అన్నప్రసాద సత్రానికి వచ్చే ప్రతి భక్తునికి అన్న ప్రసాదం అందించేనా.?



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. ఆలయాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసి భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, భక్తుల ఆకలి తీర్చే విషయంలో మాత్రం పరిమితులు పెట్టడం విమర్శలకు తావిస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసిన నిత్య అన్నదాన సత్రం భక్తులకు ఎంతో ఉపయోగకరంగా మారినా, రోజుకు కేవలం 1500 మందికే అన్నప్రసాదం అందించే విధానం భక్తుల సంఖ్యకు ఏమాత్రం సరిపోవడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం రోజుకు దాదాపు 1500 మంది భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు అనుమతి ఉండగా, వాస్తవంగా 1800 మంది కంటే అధికంగా భక్తులు వస్తున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో అనుమతికి మించిన భక్తులకు అన్నప్రసాదం అందించలేని పరిస్థితి నెలకొంటోంది. ముఖ్యంగా సోమ, శుక్ర, శని, ఆదివారాలలో భక్తుల రద్దీ మరింత పెరుగుతుండటంతో సమస్య తీవ్రతరమవుతోంది.

## రుచికరమైన భోజనం.. శ్రద్ధగా నిర్వహణ

అన్నదాన సత్రంలో భక్తులకు అందిస్తున్న వంటకాలు మంచి రుచికరంగా, నాణ్యతతో ఉంటున్నాయని పలువురు భక్తులు అభినందిస్తున్నారు. ఇంచార్జ్ శివ, సూపరిడెంట్ రాజు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నప్రసాద కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారని భక్తులు తెలిపారు. భక్తులకు సకాలంలో భోజనం అందించేందుకు సిబ్బంది శ్రద్ధగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

ప్రస్తుతం మధ్యాహ్నం 12 గంటల నుంచి సుమారు 3:30 గంటల వరకు అన్నప్రసాదం అందిస్తున్నారు. అయితే ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ సమయాన్ని సాయంత్రం 5 గంటల వరకు పొడిగించాల్సిన అవసరం ఉందని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆలయ అభివృద్ధి అంటే భవనాలేనా.?

ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశామని చెప్పడం మాత్రమే సరిపోదని భక్తులు అంటున్నారు. ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడికి కనీస సౌకర్యాలు కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని స్పష్టం చేస్తున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఆలయ ప్రాంగణాన్ని అభివృద్ధి చేసినప్పుడు, అక్కడికి వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని అన్నప్రసాద సౌకర్యాన్ని కూడా విస్తరించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. అన్నప్రసాద కార్యక్రమంలో ఎక్కువగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన భక్తులు పాల్గొంటున్నారని, వారిలో చాలామంది దూర ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనం కోసం వస్తున్నారని భక్తులు పేర్కొంటున్నారు. అలాంటి వారిని కేవలం భోజనాల సంఖ్య సంఖ్య, సమయం పరిమితి కారణంగా అన్నప్రసాదం అందకుండా భక్తులను వెనక్కి పంపడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే యాదగిరిగుట్ట ఆలయం పై దేవుని దర్శనం తర్వాత ప్రసాదం పెట్టే ఆచారాన్ని తొలగించారా.? మరి ఎందుకు ప్రసాదం పెట్టడం లేదో అని భక్తులు మండిపడుతున్నారు. దేవాదాయ శాఖలో దైవదర్శనం తర్వాత ప్రతి భక్తుడికి తీర్థం, ప్రసాదం పెట్టాలని కమిషనర్ ఆదేశాలు



ఉన్న సాక్షాత్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రసాదం పెట్టకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు.

## ప్రతి భక్తునికీ అన్నప్రసాదం అందాలి

యాదగిరిగుట్ట కు భక్తుల సంఖ్య పెరిగిందని, ఆదాయం పెరిగిందని అధికారులు గొప్పగా చెబుతున్నారు. యాదగిరిగుట్టకు వచ్చే భక్తుల సంఖ్యను అధికారులు, ప్రభుత్వం సమగ్రంగా అంచనా వేసి అన్నదాన సామర్థ్యాన్ని పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. రోజుకు 1500 మందికే పరిమితం కాకుండా



అవసరాన్ని బట్టి అదనపు భక్తులకు కూడా అన్నప్రసాదం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆలయ అభివృద్ధి అంటే కేవలం గోపురాలు, భవనాలు, రహదారులు నిర్మించడం కాదు. స్వామివారి దర్శనం కోసం వచ్చే ప్రతి భక్తుడి ఆకలి తీర్చడం కూడా అంతే ముఖ్యమని భక్తులు స్పష్టం చేస్తున్నారు. అన్నప్రసాద సమయాన్ని సాయంత్రం 5 గంటల వరకు పొడిగించడంతో పాటు, రద్దీ రోజుల్లో అదనపు ఏర్పాట్లు చేసి "యాదగిరిగుట్టకు వచ్చిన ఏ భక్తుడూ ఆకలితో తిరిగి వెళ్లకూడదు" అనే విధానాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భక్తులు కోరుతున్నారు.

# మార్పు కోసం ఎదురు చూడొద్దు

# మనమే మార్పుకు నాంది పలుకుదాం

- సమాజం మారాలంటే ముందు మన ఆలోచనలు మారాలి,
- సమాజంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. రోడ్లపై చెత్త, ట్రాఫిక్ సమస్య, వెలగని స్ట్రీట్ లైట్స్, పర్యావరణ కాలుష్యం, వృద్ధుల నిర్లక్ష్యం, విద్యార్థులపై ఒత్తిడి, పేదల ఇబ్బందులు, సమస్య ఏదైనా సరే మనం వెంటనే అడిగే ప్రశ్న ఒక్కటే ప్రభుత్వం ఏం చేస్తోంది.? కానీ ఒక్కసారి మనల్ని మనం కూడా ప్రశ్నించుకోవాలి.

**(చిన్న- ప్రశ్న న్యూస్ మేడ్చల్ ప్రతినిధి)**



సమాజం కోసం నేను ఏం చేస్తున్నాను.? ఈ ఒక్క ప్రశ్నకు ప్రతి ఒక్కరూ నిజాయితీగా సమాధానం చెప్పగలిగితే సమాజంలో చాలా సమస్యలు తీరుతాయి. అధికారులలో ఎంతో మార్పు వస్తుంది. చిన్న బాధ్యత.. పెద్ద మార్పు రోడ్డుపై చెత్త కనిపిస్తే మనం కూడా అక్కడ చెత్త వేయకుండా ఉండటం ఒక బాధ్యత.
ట్రాఫిక్ సిగ్నల్ వద్ద నియమాలు పాటించడం ఒక బాధ్యత.
వృద్ధులు రోడ్డు దాటేందుకు సహాయం చేయడం మానవత్వం.
అంబులెన్స్ చప్పుడు వినగానే రోడ్డుపై పక్కకు వచ్చి దారి ఇవ్వడం మానవత్వం, బాధ్యత. అవసరంలో ఉన్న విద్యార్థికి పుస్తకం అందించడం సేవ. చెట్టు నాటడం మాత్రమే కాదు, నాటిన చెట్టును పెంచడం కూడా మన బాధ్యత. సమాజ సేవ అంటే పెద్ద పెద్ద కార్యక్రమాలు చేయడమే కాదు. మన రోజువారీ జీవితంలో మనం చేసే చిన్న మంచి పనులే నిజమైన సమాజ సేవ. మన పిల్లలకు మనమే ఆదర్శం పిల్లలకు మంచి మాటలు చెప్పడం కంటే మన ప్రవర్తనతో మంచి చూపించడం చాలా గొప్పది."చెత్త వేయకూడదు" అని పిల్లలకు చెప్పి మనమే రోడ్డుపై చెత్త వేస్తే వారు ఏం నేర్చుకుంటారు.?"నిజాయితీగా ఉండాలి" అని చెప్పి మనమే చిన్న విషయాల్లో అబద్ధాలు చెబితే పిల్లలు ఏం నేర్చుకుంటారు.?అందుకే తరాలకు మంచి సమాజాన్ని అందించాలంటే ముందుగా మన ప్రవర్తనలో మార్పు రావాలి.

## మన ఊరు.. మన బాధ్యత

మన ఇంటి ముందు శుభ్రంగా ఉంటే సరిపోదు. మన వీధి కూడా శుభ్రంగా ఉండాలి. మన ఇల్లు సురక్షితంగా ఉంటే సరిపోదు. మన చుట్టుపక్కల ప్రజలు కూడా సురక్షితంగా ఉండాలి.
మన కుటుంబం బాగుంటే సరిపోదు. మన సమాజం కూడా బాగుండాలి.
"నా పని కాదు" అనే ఆలోచనను వదిలి
"ఇది నా సమాజం" అనే భావన పెంచుకోవాలి.

## మార్పు ఎక్కడి నుంచి రావాలి.?

ప్రభుత్వాలు, ప్రభుత్వ అధికారులు తమ బాధ్యతను నీతి, నిజాయితీగా నిర్వర్తించాలి. అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించాలి. కానీ వాళ్లకే సమస్యలు సృష్టించే విధంగా ఉండకూడదు. ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలి. కానీ పదవి రాగానే ప్రజలను దూరంగా పెట్టకూడదు. అదే సమయంలో ప్రజలు కూడా తమ బాధ్యతను నిర్వర్తించాలి.

## ప్రశ్నించే హక్కు మనకుంది

సమాజంలో నెలకొన్న సమస్యలపై, అవినీతి, అక్రమాలపై బాధ్యతగా వ్యవహరించే కర్తవ్యం కూడా మనదే.
సమాజంలో మార్పు ఒక్కరోజులో రాదు. కానీ ఒక వ్యక్తి నుంచి మొదలైన మంచి ఆలోచన, ఒక కుటుంబానికి, ఒక వీధికి, ఒక గ్రామానికి, ఒక పట్టణానికి ఆదర్శంగా మారవచ్చు. పాఠశాలలో ఒక టీచర్ మంచి ప్రవర్తన ఆ పిల్లల భవిష్యత్తినే అపురూపంగా తీర్చిదిద్దుతుంది. అలాగే ప్రభుత్వ కార్యాలయాలలో ఒక మంచి అధికారి ప్రవర్తన ఆ శాఖలోనే మార్పు తీసుకువస్తుంది, ఇతరుల బాధ్యతను పెంచుతుంది.
అదే ఒక ప్రభుత్వ అధికారి బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం, అవినీతి, అక్రమాలు ఆ శాఖలోని అందరి అధికారులు, సిబ్బందిపై ప్రభావం చూపి ప్రజలకు తీవ్ర అన్యాయం కలిగించవచ్చు.

## మన పిల్లలకు, సమాజానికి మనం ఇచ్చే సందేశం ఇదేనా

మన పిల్లలకు ఆస్తులు ఇవ్వకపోయినా పర్వాలేదు.
కానీ వారికి శుభ్రమైన వాతావరణం, సురక్షితమైన సమాజం, అబద్ధాలు మాట్లాడక పోవడం, మంచి విలువలు, మానవత్వం, ఉన్న ప్రపంచం అందిద్దాం.
మార్పు కోసం మరొకరి కోసం ఎదురుచూడకండి.
మన ఇంటి నుంచే ప్రారంభిద్దాం.
మన ఆఫీసు నుంచే ప్రారంభిద్దాం.
మన వీధి నుంచే ప్రారంభిద్దాం.
మన ఊరి నుంచే ప్రారంభిద్దాం.
"నేను మారితే నా కుటుంబం మారుతుంది...
నా కుటుంబం మారితే సమాజం మారుతుంది.
సమాజం మారితే దేశం మారుతుంది.
మన కోసం కాదు, మన తర్వాత తరాల కోసం మంచి సమాజాన్ని నిర్మిద్దాం

# సిమ్ కార్డు నిబంధనలు కఠినతరం

**- ఇకపై ఫొటో చెక్ తప్పనిసరి!**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) డిజిటల్ మోసాలు, ఆర్థిక నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర టెలికాం విభాగం (డీఓటీ) కీలక నిర్ణయం తీసుకుంది. సిమ్ కార్డుల జారీ, వినియోగంపై నిబంధనలను మరింత కఠినతరం చేసింది. ఇందులో భాగంగా, ఒక వ్యక్తి గరిష్ఠంగా 9 సిమ్ కార్డులు మాత్రమే కలిగి ఉండాలన్న నిబంధనను పటిష్ఠంగా అమలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ఆగస్టు 17న టెలికాం కంపెనీలకు సర్క్యులర్ జారీ చేసింది. ఈ నూతన నిబంధనల అమలు కోసం 'డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్' (డీఐపీ) అనే ప్రత్యేక వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఎవరైనా తొమ్మిది సిమ్ కార్డుల పరిమితిని మించితే, వారి ఫొటోను ఈ ప్లాట్‌ఫామ్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆగస్టు 23 నుంచి ఈ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. టెలికాం కంపెనీలు కొత్త సిమ్ జారీ చేసే ముందు కస్టమర్ ఫొటోను ఈ డీఐపీ డేటాతో తప్పనిసరిగా సరిపోల్చుకోవాలి. ఒకవేళ పరిమితికి మించి సిమ్ కార్డులు ఉన్నట్లు తేలితే, సదరు వ్యక్తికి కొత్త సిమ్ జారీని నిరాకరించాలి.ఆగస్టు 24 నుంచి టెలికాం ఆపరేటర్లు ఈ డీఐపీ వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు నవీకరించాల్సి ఉంటుంది. నవంబర్ 30 నాటికి ఈ ప్రక్రియ అంతా రియల్ టైమ్‌లో పనిచేసేలా చూడాలని డీఓటీ స్పష్టం చేసింది. నిర్ణీత పరిమితికి మించి సిమ్ కార్డులు కలిగి ఉన్న వినియోగదారులు వాటిని స్వచ్ఛందంగా సరెండర్ చేయాలని సూచించింది. లేనిపక్షంలో, సంబంధిత టెలికాం కంపెనీలే వాటిని నిలిపివేస్తాయి. ఇదిలా ఉండగా, ఒక వ్యక్తి పేరు మీద ఎన్ని సిమ్ కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయో తెలుసుకునేందుకు ప్రభుత్వం 'సంచార్ సాథీ' పోర్టల్‌ను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. వినియోగదారులు ఈ పోర్టల్ ద్వారా తమ వివరాలను సులభంగా తనిఖీ చేసుకోవచ్చు.

# భారీ చిత్రాలకు కొత్త రూల్

**- తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారీ బడ్జెట్ సినిమాల టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ ధరల పెంపు ద్వారా అదనంగా వచ్చే వసూళ్లలో 20 శాతం మొత్తాన్ని సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ)కు ఇవ్వాలని ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 'పెద్ది', 'రాజాసాబ్', 'మనశంకర వరప్రసాద్ గారు', 'అఖండ 2' వంటి చిత్రాలకు ఇది వర్తించనుంది. ఈ సినిమాల టికెట్ ధరల పెంపుతో వచ్చిన కలెక్షన్‌లో 20 శాతాన్ని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు, టీజీఎఫ్‌డీసీ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. ఈ 20 శాతం వాటాను ఎగ్జిబిటర్ల (థియేటర్ల యజమానులు) నుంచి వసూలు చేసి, సంబంధిత ఖాతాల్లో జమ చేయాల్సిన బాధ్యత నిర్మాతలపై ఉంటుందని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఇటీవల విడుదలైన భారీ చిత్రాలతో పాటు భవిష్యత్తులో రాబోయే పెద్ద సినిమాలకు కూడా ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో సినీ పరిశ్రమలోని కార్మికుల సంక్షేమానికి ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

# కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు

**- విద్యార్థులు, యువత సమస్యలపై సీడబ్ల్యూసీలో కీలక చర్చ**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఉన్నత విద్య సామాన్యులకు భారంగా మారుతోందని, ప్రముఖ విద్యాసంస్థలన్నీ క్రమంగా ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆయన ఆరోపించారు. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు పేపర్ లీకేజీలు, రిక్రూట్‌మెంట్ పరీక్షల కుంభకోణాలే స్వాగతం పలుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, నిర్లక్ష్య వైఖరి వల్ల యువత రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా యువత లేవనెత్తిన అసలైన సమస్యలకు సమాధానం చెప్పకుండా తప్పించుకున్నారని ఖర్గే విమర్శించారు. యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ 'విద్య నుంచి ఉపాధి వరకు రోడ్‌మ్యాప్'ను రూపొందించాల్సి ఉందన్నారు. అలాగే అయోధ్య రామాలయం విరాళాల చోరీ వివాదంపై స్పందిస్తూ, నిధుల గోల్‌మాల్‌పై నిష్పాక్షిక విచారణ జరిపించి బాధ్యులను జవాబుదారీ చేయాలని డిమాండ్ చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588